www.velthuru.com

RNI TEL TEL/ 2019 / 78609

రంగారెడ్డి

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక

మంగళవారం 6 మే 2025

సంపుటి :06 సంచిక : 336 , పేజీలు : 12 వెల:రూ.5/-

TELANGANA, ANDHRA PRADESH



## కేంద్ర మంత్రి గడ్కరీని ని శాలువతో సత్కరించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో జిల్లా అభివృద్ధిపై చర్చించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మే 05:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్రం ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనలో ఆదిలాబాద్ ఎంపీ గెడం నాగేష్, ఎమ్మెల్యే పాయల్ 2 లో..

# రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి

- రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు
- సమరం కాదు..సంయమనం కావాలి
- మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం
- కలసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది
- ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సిఎం రేవంత్



**హైదరాబాద్,మే5( వెలుతురు):** ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. 2 లో..

## మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు
- మే10నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు
- చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

- ఉద్యోగాల నియమకాలు.. కొత్త బస్సుల కొనుగోళ్ల చేశాం
- అనేక బకాయిలను కూడా చెల్లించి మేలు చేశాం
- ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు
- ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన



**హైదరాబాద్,మే5( వెలుతురు):** కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ 3 లో..



రోడ్ సేఫ్టీ అవేర్నెస్ లో భాగంగా కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారికి హెల్మెట్ బహుకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్


వెలుతురు హైదరాబాద్ మే 05:

# తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

- రోడ్డు కనెక్టివిటీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- రూ.3,900 కోట్ల విలువైన పనులకు ప్రారంభం
- నీటి సంరక్షణ పథకాలతో రైతులకు మేలు
- ఈ దశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి
- కాగజ్‌నరగ్ వేదికగా కేంద్రమంత్రినితిన్ గడ్కరీ

తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని..అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సభావేదికపై నుంచి జాతీయ రహదారులను ఆయన ప్రారంభించారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను మొదలుపెట్టి మాట్లాడారు.ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు- చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు.



**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,మే5 (వెలుతురు):** ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ఆదిలాబాద్ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిందని, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, తనకు 13 డాక్టరేట్లు ఉన్నాయని.. తాను ఇంజనీరును కానని, అయినా 13 డాక్టరేట్లు ఉన్నాయని నితిన్ గడ్కరీ చెప్పారు. ఇక్కడి ప్రజల సమస్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని 2 లో..

# ప్రధాని మోడీకి పుతిన్ ఫోన్

- ఉగ్రవాదంపై పోరులో అండగా ఉంటామని హామీ
- మోడీతో రక్షణశాఖ కార్యదర్శి అత్యవసర భేటీ

2 లో..



**న్యూఢిల్లీ,మే5(వెలుతురు):** భారత్-పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్ ద్వారా సంభాషించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన పుతిన్, ఉగ్రవాదంపై

# రాజీవ్ రహదారిని నేషనల్ హైవేగా మార్చేందుకు కేంద్రం సిద్ధం




- కోమటిరెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలి
- గత పాలకులు వెనుకబడేసిన జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్
- ఆ కాంట్రాక్టర్ తో ఉన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించుకోవాలి
- ఎన్నికల వరకే రాజకీయాలు...ఆ తరువాత తెలంగాణ అభివృద్దే మోదీ సర్కార్ లక్ష్యం
- అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు కేంద్రం సిద్ధం
- మోదీ పాలనలో ఆదిలాబాద్ సహా రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి
- జాతీయ రహదారుల కోసమే లక్షా 25 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోదీ సర్కార్ దే
- గడ్కరీ మంచి మనసున్న మనిషి...
- పార్టీతో బేధం లేకుండా ఎవరు వెళ్లినా పనులు చేస్తారు
- సిర్పూర్ కాగజ్ నగర్ బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

2 లో..

# హైదరాబాద్ చేరుకుంటున్న సుందరీమణులు

- ఘనంగా స్వాగతిస్తున్న తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్,మే5( వెలుతురు):** మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ హైదరాబాద్ చేరుకుంటున్నారు. సోమవారం పోర్చుగల్, ఘనా, ఐర్లాండ్ దేశాలకు చెందిన ప్రతినిధులు శంషాబాద్ చేరుకున్నారు. వీరికి పూర్తి సంప్రదాయ 2 లో..

## కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరుకు రోడ్డు కనెక్టివిటీ

- హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి




# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

- ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే గుర్తించాలి
- ఎక్కడా ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు
- అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి
- అందాలపోటీపై ఉన్న శ్రద్ధ రైతులపైనా పెట్టండి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



3 లో..

## తమిళనాడు మత్స్యకారులకు రక్షణ ఇవ్వాలి

- ఇరు దేశాలు ఈ సమస్యపై పరస్పరం చర్చించాలి
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి,మే5( వెలుతురు):** భారత మత్స్యకారుల విషయంలో శ్రీలంక ఉదారంగా ఉండాలని, సమస్యలు ఉంటే ఇరు దేశాలు కలిసి చర్చించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన 2 లో..

## ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వం ఒప్పందం

- ఎలకట్రానిక్స్, ఎనర్జీ రంగాల్లో యువతకు ఉపాధి
- ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి



**అమరావతి,మే5( వెలుతురు):** ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంఅని ఐటీశాఖ మంతరి లోకేశ్ అన్నారు. పరిశ్రమ 2 లో..

(మొదటి పేజీ తరువాయి..).

### కేంద్ర మంత్రి గడ్కరీని ని శాలువతో సత్కరించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



శంకర్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీని ని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో జిల్లా అభివృద్ధిపై చర్చించారు..

## ప్రధాని మోడీకి పుతిన్ ఫోన్

భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తిమద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపేతం చేసేందుకు కట్టు-బడి ఉన్నామని మోదీ, పుతిన్ పునరుద్ఘాటించారు. మే 9న రష్యా విక్టరీ డేను నిర్వహించుకోనుంది. దీనిపై అధ్యక్షుడికి మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ ఏడాది రెండుదేశాల మధ్య వార్షిక సదస్సు భారత్‌లో నిర్వహించనున్నారు. అందుకోసం మన ప్రధాని ఆహ్వానం పలకగా.. పుతిన్ అంగీకరించారు. ఈ విషయాలను మన విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాలు భగ్గుమన్నాయి. అలాగే తదుపరి చర్యలపై కేంద్ర ప్రభుత్వం పలు కీలక భేటీలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో ప్రధాని నరేంద్రమోదీతో రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ భేటీ- అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ- జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని అప్పుడు సీసీఎస్ వెల్లడించింది. ఇటీ-వల సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. ఇక వరుసగా నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి, తర్వాత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్.. మోదీతో భేటీ- అయ్యారు. ఈ క్రమంలో రక్షణశాఖ కార్యదర్శి సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉగ్రదాడి తర్వాత భారత్ ఇప్పటివరకు సైనికంగా బదులివ్వకపోయినా.. పాకిస్థాన్‌ను అన్నివైపుల నుంచి దిగ్బంధిస్తోంది. సింధునది జలాలను అడ్డుకోవడం ద్వారా ఇప్పటికే పొరుగుదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా తాజాగా.. బగలిహార్ జలాశయం నుంచి నీటి సరఫరాను భారత్ నిలిపివేసింది. విద్యుదుత్పత్తికి ఉద్దేశించిన ప్రాజెక్టు నుంచి నీరు వదలకపోవడం వల్ల పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు సాగునీరు నీరందడం లేదు.

## హైదరాబాద్ చేరుకుంటున్న సుందరీమణులు

లాంఛనాలతో పర్యాటక శాఖ స్వాగతం పలికింది. స్వాగత సత్కారాలతో పాటు-, భద్రత, వసతికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. పోర్చుగల్ కు చెందిన మారియా అమెలియా ఆంటోనియో, ఘనా నుంచి జుట్టా అమా పోకుహ్ అడ్డో, ఐర్లాండ్ కు చెందిన జాస్మిన్ జెర్హార్డ్ లు హైదరాబాద్ చేరుకున్నారు. ఇప్పటికే,మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జన్సెన్ వాన్ రెన్స్ బర్గ్ , మిస్ బ్రెజిల్ జెస్సికా స్కెన్డ్రియుజ్య్ పెడ్రోసో, మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొరిసన్ లు ఇప్పటికే చేరుకున్నారు. ఈనెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రారంభ కార్యక్రమంపై మిస్ వరల్డ్ చైర్ పర్సన్ జూలియా మోర్లీ సన్నాహక, సమన్వయ కార్యక్రమాలను ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

### తమిళనాడు మత్స్యకారులకు రక్షణ ఇవ్వాలి

సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు- డిప్యూటీ- సీఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నాగపట్నం జిల్లాకు చెందిన ఈ మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం.. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నానని పోస్టు చేశారు. కాగా రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు-... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచే వారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటు-ందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించిందని పవన్ కల్యాణ్ అన్నారు.

## ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వం ఒప్పందం

అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ శిక్షణ ఇస్తుంది. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ.5 కోట్లు- ఖర్చుచేయనుంది. మంగళగిరిలో రూ.15 కోట్లతో ఎలక్ట్రిక్ సెంటర్ ఏర్పాటు-కు ష్నైడర్ అంగీకారం తెలిపింది. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ-, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలి-టె-క్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన -ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా అనంతపురంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు-కు ముందుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. మరోవైపు అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ మై లెర్న్ ఎ÷-లాట్‌ఫామ్ ద్వారా మూడేళ్లలో 4లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒరాకిల్, ఏపీఎస్-ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ కుదిరింది.



# రూపాయి అప్పు కూడా పుట్టని పరిస్థితి

మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందామని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు-, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

### మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు- చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3000 మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులు అంతా సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ- పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు- తెలంగాణ తల్లి, సెక్రటేరియట్ తోపాటు- రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టు-దిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలన్నారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు- చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ- పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు- హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్ కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు- గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు- వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరపున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్ లతో పాటు- సిటీ-లోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

# తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

చేపట్టినట్లు- తెలిపారు. జగిత్యాల- కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని కొనియాడారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టాం. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నాం. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుంది. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం. అంబర్‌పేట్‌లో నిర్మించిన పైవంతెనను ఇవాళే ప్రారంభించు కోనున్నాం. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాలి. వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. స్మార్ట్ సీటీలు కాదు...స్మార్ట్ విలేజ్‌లను తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో రెండులక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం రాబోయే రోజుల్లో లక్ష కోట్లు- ఖర్చు చేస్తామని చెప్పారు. గడ్చిరోలీ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రైతులు ఆత్మహత్యచేసుకున్న విదర్భలో తాము పనిచేశామని చెప్పారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలన్నారు. వెనుకబడిన జిల్లాలో అభివృద్ధి కోసం మేం పనిచేస్తున్నాం. అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలు పెంచుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే మేం నీటి నిల్వలు పెంచేందుకు సిద్ధం. తెలంగాణలో కూడా అలా నీటి సరస్సులను గుర్తిస్తే మేం అభివృద్ధి చేస్తాం అని గడ్కరీ హామీ ఇచ్చారు. మీ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. రోడ్డు బాగుంటేనే అమెరికా ధనిక దేశం అయింది. తెలంగాణలో కూడా రోడ్లు బాగుంటేనే ధనిక రాష్ట్రం అవుతుందన్నారు. నీరు, ఇంధనం, రవాణా, కమ్యునికేషన్, ఏఐతో ఏ ప్రదేశమైనా అభివృద్ధి జరుగుతోంది. .శ్రీనగర్, జమ్మూలో36 టన్నెల్స్ నిర్మిస్తున్నాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం, ఆర్ఎస్ఎస్ లో ఉన్నప్పుడు ఆదివాసీలతో కలిసి పనిచేశాం. యువకులకు ఉద్యోగాలు, రైతులకు మద్దతు ధర దక్కాలి. జగిత్యాల వరంగల్ హైవేకు రూ.1000 కోట్లు- కేటాయించాం అని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీ గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

### కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరు రోడ్డు కనెక్టివిటీ

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీనే లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రూ. 3,694.4 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు జరిగాయని, హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమదాలు తగ్గాయని.. సమయం తగ్గిందని అన్నారు.తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు...కేంద్రం రూ. 1.25 లక్షల కోట్లు-కేటాయించిందని తెలిపారు. క రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హైవేల విస్తీర్ణం 5 వేల కిలోమీటర్లు దాటిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్కరీతో కలసి ఆయన కాగజ్‌నగర్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటల్‌ఆడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీ-ని పెంచడం మోదీ సర్కార్ లక్ష్యమని అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయి. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 7 -టె-క్స్-టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కింది. రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశాం. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రాజీవ్ రహదారిని నేషనల్ హైవేగా మార్చేందుకు కేంద్రం సిద్ధం

**సిర్పూర్ కాగజ్ నగర్ వెలుతురు మే 05:** హైదరాబాద్-కరీంనగర్ -మంచిర్యాల రాజీవ్ రహదారి నాగుపాములా అధ్వాన్నంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. క్వాలిటీ లేకుండా పనులు చేయడంవల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ మేరకు నితిన్ గడ్కరీ హామీ కూడా ఇచ్చారని తెలిపారు. అయితే ఆ రోడ్డుకు సంబంధించి కొన్ని సమస్యలున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ చూపాలని సూచించారు.

సోమవారం రోజున కొమరం భీం జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్ లో రూ.6100 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన పలు రహదారులకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీలు వంశీ, నగేశ్ పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగించేందుకు వేదిక వద్దకు రాగానే సభకు హాజరైన వేలాది మంది ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారత్ మాతాకీ జై అంటూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు తెలంగాణలో మరిన్ని రోడ్ల నిర్మాణాలను ప్రారంభించేందు కోసం ఈరోజు ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. దాదాపు 6 వేల 100 కోట్ల రూపాయలతో 167 కి.మీ. మేర మొత్తం 26 ప్రాజెక్టుల పనులకు సంబంధించిన కార్యక్రమాలను జాతికి అంకితం చేయడంతోపాటు శంకుస్థాపన చేస్తుండటం సంతోషంగా ఉంది.



ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఒకప్పుడు వెనుకబడిన జిల్లా. రోడ్లు, రహదారుల వ్యవస్థ ఘోరంగా ఉండేది. ఈరోజు ఉదయం నేను కరీంనగర్ నుండి ఇక్కడికి గంటన్నరలోపే వచ్చాను. తెలంగాణలో ఎక్కడికైనా సరే... పొద్దున్నే పోయి పని చూసుకుని మళ్లీ సాయంత్రానికి ఇంటికి రాగలుగుతున్నాం... దీనికి కారణమేంటి? ఒక్కసారి పదేళ్ల క్రితానికి, ఇప్పటికీ ఉన్న తేడాను గుర్తు చేసుకోండి. ఆదిలాబాద్ వెనుకబడిన ప్రాంతం కాదు. గత పాలకులు వెనుకబడేసిన జిల్లా. మోదీ ప్రభుత్వం వచ్చాక శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

గత 10 ఏళ్లలో మన తెలంగాణ రాష్ట్రానికే జాతీయ రహదారుల(నేషనల్ హైవేస్) అభివృద్ధి కోసం 1 లక్షా 25 వేల 485 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. తెలంగాణపట్ల మన మోదీగారికి, మన గడ్కరీ గారికి ఎంత ప్రేమ ఉందో ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? మోదీగారు ప్రధాని కాకముందు అంటే 1947 నుండి 2014 వరకు (గత 67 ఏళ్లలో) 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు మాత్రమే ఉండేవి. కానీ మోదీగారి హయాంలో గడ్కరీగారి పుణ్యమా అని పదేళ్లలో 5200 కిలోమీటర్లకు పెరిగాయి. అంటే రెట్టింపు స్థాయిలో నేషనల్ హైవేస్ విస్తరించాయి. అనేక జాతీయ రహదారి ప్రాజెక్టులు, కీలక ఎకనామిక్ కారిడార్లు, పర్యాటక ప్రోత్సాహక ప్రాజెక్టుల అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. ఇయాళ దేశ అభివృద్ధిలో తెలంగాణ ప్రత్యేకించి హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తోందంటే మౌలిక సదుపాయల కల్పనవల్లే సాధ్యమైంది.

గడ్కరీ వద్దకు ఏ ప్రతిపాదన తీసుకెళ్లినా కాదు, లేదు అనుకుండా నరాజ్ చేయకుండా పనులు చేసి పంపిస్తారు. బీజేపీకే కాదు ఏ మంత్రి, ఎంపీ వెళ్లినా పనులు చేస్తారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఇదే చెప్పారు. కోమటిరెడ్డి భోళా మనిషి. మనసులో ఉన్నది చెబుతారు. పనులు చేయించుకుని వస్తారు. ఇక్కడున్న మంత్రులకు, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా. రాష్ట్ర అభివృద్ధికి మేం పూర్తి సిద్ధం. సహకరిస్తాం. అనేక సందర్భాల్లో మోదీ ఇదే మాట చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అన్ని రాష్ట్రాల అభివృద్దే లక్ష్యమని చెప్పారు. తల్లి భారతమాతను విశ్వగురుగా తీర్చిదిద్ది 2047 నాటికి దేశాన్ని నెంబర్ వన్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

వెంకట్ రెడ్డి గారు... గడ్కరీ గారు ప్రామిస్ చేశారు. హైదరాబాద్ నుండి మంచిర్యాల రోడ్డు వరకు రాజీవ్ రహదారి నాగుపాములా ఉండే. క్వాలిటీ లేకుండా పనులు చేశారు. రహదారి బాగాలేదు. దయచేసి ఆ కాంట్రాక్టర్ తో మాట్లాడండి. ఆ సమస్యను పరిష్కరిస్తే రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. గడ్కరీ గారు కూడా హామీ ఇచ్చారు. వెంటనే ఈ విషయంలో కోమటిరెడ్డి చొరవ తీసుకోవాలని కోరుతున్నా.

## జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ప్రకాశ్ మగ్దుమ్



**వెలుతురు పిఐబీ ముంబై 05 మే 2025:**

జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్రీ ప్రకాశ్ మగ్దుమ్ సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. శ్రీ మగ్దుమ్ 1999 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి. ఈ పదవి చేపట్టడానికి ముందు అహ్మదాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)కి అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. రెండు దశాబ్దాల ఉద్యోగ జీవితంలో పుణెలోని నేషనల్ ఫిలిం ఆర్కైవ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఏఐ)కి డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సమయంలో సినిమాలను భద్రపరచడం, పునరుద్ధరణ తదితర ప్రయత్నాల ద్వారా భారతీయ చలనచిత్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో కీలకంగా వ్యవహరించారు. ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ)కు రిజిస్ట్రార్‌గా సేవలు అందించారు. అలాగే తిరువనంతపురంలో రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధిగా సైతం పనిచేశారు.

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది



సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ , ఎస్టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చని.. వారికి తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని..సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 ప్రకారం పే స్కేల్ 21 శాతం ఇచ్చామని..సంవత్సరానికి రూ.412 కోట్ల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు-చెల్లించామని అన్నారు. 1500 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నామని వివరించారు. తమ ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించనుందని చెప్పారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసి కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో స్పందించిన మంత్రి పొన్నం.. సమ్మె చేయొద్దని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్టీసి సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా మే 7 నుండి ఆర్టీసి కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలసిందే. ఆర్టీసి పరిరక్షణ, విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు బంద్ కానున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తోంది.

## హైదరాబాద్ సూపర్ ట్విన్స్‌కు అంతర్జాతీయ చదరంగంలో అరుదైన ఘనత

- **అమాయా అగర్వాల్‌కు ప్రపంచ నంబర్-2 ర్యాంక్, ఉమెన్ క్యాండిడేట్ మాస్టర్ టైటిల్**
- **అనయ్ అగర్వాల్ బోస్నియా ర్యాపిడ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు**



**హైదరాబాద్, వెలుతురు మే 05:**

హైదరాబాద్‌కు చెందిన సూపర్ ట్విన్స్ అమాయా అగర్వాల్, అనయ్ అగర్వాల్ అంతర్జాతీయ చదరంగ రంగంలో సంచలన విజయాలు సాధించి నగరానికి గర్వకారణమయ్యారు. కేవలం 10 ఏళ్ల వయస్సులో అమాయా అగర్వాల్, రెండేళ్లలోనే ఉమెన్ క్యాండిడేట్ మాస్టర్ (WCM) టైటిల్ సాధించి, 10 ఏళ్లలోపు బాలికల కేటగిరీలో ప్రపంచ నంబర్-2 ర్యాంక్ కైవసం చేసుకుంది. అదే సమయంలో, ఆమె సోదరుడు అనయ్ అగర్వాల్ బోస్నియాలో జరిగిన ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్ ర్యాపిడ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏకాగ్రా చెస్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ సురేష్ చైతన్య మాట్లాడుతూ, అమాయా అగర్వాల్ బోస్నియాలో జరిగిన ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి, ఫిడే రేటింగ్‌లో 2004 పాయింట్లు సాధించిందని తెలిపారు. ఏకాగ్రా చెస్ అకాడమీలో కేవలం రెండేళ్ల శిక్షణతో ఈ స్థాయి విజయం సాధించడం తమ అకాడమీకి ఎంతో గర్వకారణమని ఆయన అన్నారు. అదే విధంగా, అనయ్ అగర్వాల్ బుడాపెస్ట్, బోస్నియాలో జరిగిన అంతర్జాతీయ చదరంగ టోర్నమెంట్లలో 100కు పైగా రేటింగ్ పాయింట్లు సాధించి తన ర్యాంక్‌ను మెరుగుపరచుకున్నాడని డాక్టర్ చైతన్య వెల్లడించారు. సూపర్ ట్విన్స్‌గా గుర్తింపు పొందిన అమాయా, అనయ్‌లు ఎఫ్ఎం బెజిలీనా ఓపెన్‌లో అసాధారణ ప్రదర్శనతో ఏకాగ్రా చెస్ అకాడమీకి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ ట్విన్స్ తల్లి పనాషా అగర్వాల్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని ఇండస్ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న తమ ఇద్దరు పిల్లలు అమాయా, అనయ్‌లకు అత్యుత్తమ శిక్షణ అందించి, ఈ ఘనత సాధించేలా ప్రోత్సహించిన ఏకాగ్రా చెస్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ సురేష్ చైతన్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాలతో హైదరాబాద్ చదరంగ రంగంలో మరోసారి తన సత్తా చాటుకుందని, ఈ సూపర్ ట్విన్స్ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధిస్తారని చదరంగ ప్రేమికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కార్మికుల సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది....

*కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో లేఖ విడుదల చేసిన టీజీ ఆర్టీసీ యాజమాన్యం....*

**హైదరాబాద్ వెలుతురు మే 05:**

క్షేత్రస్థాయిలో ఆర్టీసీ కార్మికులంతా నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం వల్లే టీజీఎస్‌ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. మీరు సమిష్టి కృషితో పనిచేస్తూ బస్సుల్లో ప్రతి రోజు 60 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ఆర్టీసీ సంస్థను అన్ని తామై ముందుకు నడిపిస్తోన్న ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీపడటం లేదు. సంస్థకు వచ్చే ప్రతి రూపాయిని మీ సంక్షేమం కోసం వెచ్చించడం జరుగుతోంది. మీ అందరికీ తెలుసు.. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న కూడా.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న 2017 పీఆర్సీని 21 శాతం ఫిట్ మెంట్ తో 2024 మే నెలలో యాజమాన్యం అందించింది. పెండింగ్‌లో ఉన్న 10 డీఏలను 2019 నుంచి దశలవారీగా విడుదల చేసింది. ఆర్పీఎస్-2013 బాండ్లకు సంబంధించిన రూ.280 కోట్లను చెల్లించింది. గత మూడున్నరేళ్లుగా విధిగా ప్రతి నెల 1వ తేదీనే వేతనాలను ఇస్తోంది. పీఎఫ్, సీసీఎస్ రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమతప్పకుండా చెల్లిస్తూ బకాయిలను క్రమేణా యాజమాన్యం తగ్గిస్తోంది. టీజీఎస్‌ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మీకు తెలియంది కాదు. ఆర్థిక కష్టాల్లోనూ ఉద్యోగుల సంక్షేమానికే మొదటి ప్రాధాన్యతను సంస్థ ఇస్తోంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటూ అభివృద్ధి పథంలో పయనిస్తోన్న సంస్థకు, ఉద్యోగులకు సమ్మె అనేది తీరని నష్టం కలిగిస్తుంది. ఆర్టీసీ బాగుంటేనే మనమంతా సంతోషంగా ఉంటాం. సమ్మె అనేది సమస్యలకు పరిష్కారం కాదు. 2019లో జరిగిన సమ్మె వల్ల సంస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడింది. బాధాకరమైన విషయం ఏంటంటే.. ఆ సమ్మె వల్ల ఆర్టీసీ 39 మంది ఉద్యోగులను కొల్పోయింది.

సమ్మె తర్వాత వచ్చిన కరోనా వల్ల ఆర్టీసీ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. మీ సమిష్టి కృషి వల్ల అన్ని సంక్షోభాలను ఎదుర్కొని.. ప్రజల మన్ననలు చూరగొంటున్న ఇలాంటి పరిస్థితుల్లో సమ్మె అనేది శ్రేయస్కరం కాదు. ఒక్కసారి ప్రజలు అసంతృప్తికి గురైతే కొంతకాలంగా సంస్థ బాగు, ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలన్నీ నిర్వీర్యం అయిపోతాయి. ఇవన్నీ సంస్థ మనుగడకు ప్రతికూల అంశాలుగా మారే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కట్టుబడి ఉంది. ఈ అంశం గురించి గౌరవ సీఎం రేవంత్ రెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. సమ్మె వల్ల సంస్థ ప్రగతితో పాటు ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుంది. తల్లి లాంటి ఆర్టీసీని కాపాడుకునేందుకు సమ్మె ఆలోచనను విరమించుకోవాలని ఆర్టీసీ సిబ్బందికి యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది. ఒక వర్గం తమ మనుగడ కోసం చెప్పే మాటలకు ప్రభావితమై సమ్మెకు వెళ్తే సంస్థతో పాటు ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందనే విషయం మరిచిపోవద్దని సూచిస్తోంది. ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు కలగకుండా సేవలందిస్తూ.. సంస్థ మేలు కోసం ఆలోచించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉందని పేర్కొంది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు నిషేధం. సంస్థ నిబంధనల మేరకు సమ్మె చట్టవ్యతిరేకమైంది. సమ్మె పేరుతో ఉద్యోగులను ఎవరైనా బెదిరించిన, విధులకు ఆటంకం కలిగించిన బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మూడున్నరేళ్లుగా సంస్థ బాగు కోసం యాజమాన్యం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని ఉద్యోగులు స్వాగతించారు. వాటిని విజయవంతం కూడా చేశారు. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోన్న సమయంలో సమ్మె పేరుతో చేజేతులా సంస్థ మనుగడకు, ఉద్యోగుల భవిష్యత్ కు ముప్పు వాటిల్లే విధంగా వ్యవహరించవద్దని యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది. ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీపడబోదని మరోసారి స్పష్టం చేస్తోంది.

## ఆర్టీసీ సమస్యలను మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చిన ఆర్టీసీ సంఘాల నేతలు

*రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని కలిసిన ఆర్టీసీ పలువురు సంఘాల నేతలు..*

**హైదరాబాద్ వెలుతురు మే 05:**

మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసి చైర్మన్ టిఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామ రెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్ ,కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ ,STMU జనరల్ సెక్రెటరీ పున్న హరి కృష్ణ పలువురు ఆర్టీసీ సంఘాల నేతలు.. ఆర్టీసీ సమస్యలను మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చిన ఆర్టీసీ సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ సమస్యల పై ఆర్టీసీ సంక్షేమం కోరే ఎవరైనా ఈరోజు ,రేపు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు మీకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటా.. ఆర్టీసీ సమస్యలు వినడానికి నేను కానీ మా ముఖ్యమంత్రి గారి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయి.. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తుంది ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.. సమస్యలు తొలుగుతున్నాయి. సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్న.. మీ సమస్యలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటా.. ఆర్టీసీ కి 16 నెలలు గా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశాం..ఒక్కటైన ఇబ్బంది పెట్టమా.. ఆర్టీసీ సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారు.. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసీని నిర్వీర్యం చేశారు.. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదు ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదు, ccs,pf పైసలు వాడుకున్నారు.. TGSRTC ఉద్యోగులకు 2013 నుండి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించింది. 2017 పే స్కేల్ 21% శాతం ఇచ్చింది సంవత్సరానికి 412 కోట్లు భారం పడుతుంది. పిఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘ కాలంగ పెండింగ్ లో ఉన్న 1039 కోట్లు చెల్లించాం.. నెలవారీ PF కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుంది చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ccs బకాయిలు ఉద్యోగులకు 345 కోట్లు రూపాయలు చెల్లించాం నెలవారీ CCS కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుంది 1500 మంది కారుణ్య నియామకాలు చేపట్టినం ప్రభుత్వం TGSRTCలో





3038 మంది ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అనుమతి ఇచ్చింది కొత్త బస్సులు కొనుగోలు చేశాం, తార్నాక ఆసుపత్రి ను సూపర్ స్పెషాలిటీ గా మార్చాం..

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

**సిద్దిపేట,మే5( వెలుతురు):**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతన్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బిర్రు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యులు అని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, వారి ప్రాణాల మీదకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమని హరీశ్‌రావు అన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు ప్రాణులు కోల్పోతుంటే ఏం ముఖం పెట్టుకొని వేడుకలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని హరీశ్‌రావు అన్నారు. ఒక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పినందుకు, ఇంకెందుకో తెలియదు గానీ ప్రకృతి పగ పట్టినట్టుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని.. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రహసనంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దీని విలువ రూ. 5664 కోట్లుత అని.. చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం.. ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదని హరీశ్‌రావు తెలిపారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని అన్నారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని చెప్పారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు ప్రక్రియ జరగడం లేదని విమర్శించారు. మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ధాన్యపు కుప్పల మీదనే ప్రాణాలు వదిలారన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక పంట పండిందని గొప్పలు చెప్పడం కాదని.. రైతుల బాధలు పట్టించుకోవాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు. పండిన పంటను కొనక రైతులను తిప్పలు పెడుతున్నారని.. అయితే ఢిల్లీకి.. లేకుంటే అందాల పోటీల రివ్యూలు... అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ.. రైతుల మీద లేకుండా పోయిందన్నారు. అకాల ఈదురు గాలులు, వర్షాలకు మామిడి కాయ లేకుండా మొత్తం రాలి పోయిందని అన్నారు. పత్తి రైతుల్ని కూడా ప్రభుత్వం ముంచిందని, పత్తి రైతులకు 20 శాతం మాత్రమే ఏంఎస్‌పికి తీసుకున్నారని.. మిగతా 80 శాతం బ్రోకర్లు, ప్రైవేటు మిల్లర్ల పాలు చేశారని విమర్శించారు.

దాదాపు మూడు వేల కోట్ల నష్టం రైతులకు జరిగిందన్నారు.పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. బోనస్ అని గొప్పగా చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా ఆగిపోయిందని.. తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవుడు, చర్చి, దర్గా మీద సీఎంకు నమ్మకం ఉంటే రుణ మాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి పరిపాలన సరిగా చేయడంలేదని, పాలన గాలిలో దీపంలా మారిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదు.. నాణ్యమైన కరెంటు ఇవ్వలేదు.. నీళ్లు ఇవ్వలేదు.. పండిన పంటను కూడా కొనడం లేదు అని విమర్శించారు. రుణమాఫీ జరిగిన రైతులు వివరాలతో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు-చేయాలని సూచించారు.

25 శాతం మందికి రుణమాఫీ చేసి పూర్తి రుణమాఫీ జరిగిందని ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. మరికొన్ని చోట్ల దొంగల బెడద కూడా రైతన్నకు నిద్ర లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నదని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం నిరాశలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పత్తి రైతులకు ప్రభుత్వం మోసం చేసింని అన్నారు. ఈఈఒ అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.

# సంపాదకీయం..

## సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి !


అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక..అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు. పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా..ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రీమియం ప్రబుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్దం చేయాల్సి ఉంది. మనిషికి, పశువులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్దతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్దిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు కూడా బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ది సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్దం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

# కౌలు రైతుల వరం అన్నదాత సుఖీభవ పథకం

- విధివిధానాలతో పాటు..అర్హుల గుర్తింపు ప్రక్రియ
- ఈనెలలోనే ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు

**అమరావతి,మే5( వెలుతురు):**

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఎపి లోని కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. కౌలు రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే ఈ పథకం ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దీనిని అమలు చేయబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.. ఇప్పటికే పలు హామీలను అమలు చేస్తుండగా.. మే నెలలో మరో రెండు పథకాలను నెరవేర్చేందుకు సిద్ధమైంది. వీటిలో ముఖ్యమైనది అన్నదాత సుఖీభవ పథకం. దీనికింద ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున సాయం అందజేయనుంది. ఈ పథకాన్ని సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం అందించే రూ.20 వేలను.. మూడు విడతల్లో ఇస్తారు. ఈ రూ. 20 వేలల్లో పిఎం కిసాన్ పథకం కింద వచ్చే పథకం కింద ఇచ్చే రూ.6 వేలు కూడా కలుపుతారు. అటవీ భూములపై హక్కులు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకానికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. పూర్తి వివరాలు సేకరించిన తరవాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సిద్ధగా ఉన్నారు. ఈ పథకం




అమలుకు సంబంధించి వ్యవసాయశాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా ఇప్పటికే మరణించిన లబ్ధిదారుల పేర్లను తొలగించడం, భూ రికార్డులకు అనుగుణంగా లబ్ధిదారుల నమోదు, రైతుల ఐడీ నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఈకేవైసీ వివరాల సవరణ వంటి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన గిరిజనులకు, అలాగే ప్రత్యేకంగా గుర్తించబడిన అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన అర్హుల ఎంపిక కోసం గిరిజన శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది.ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. ప్రస్తుత, మాజీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, మంత్రులు, శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు వంటి రాజ్యాంగ బద్ధ పదవులను నిర్వహిస్తున్నవారు, నిర్వహించినవారు అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు, శాఖల కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థలలో, స్థానిక సంస్థలలో శాశ్వత ఉద్యోగంగా పని చేస్తున్నవారు కూడా ఈ పథకం కింద సాయం పొందడానికి అనర్హులు. అలాగే నెలకు రూ.10 వేలు లేదా అంతకన్నా ఎక్కువ పెన్షన్ తీసుకునే వారికి కూడా పథకం వర్తించదు. అయితే, మల్టీటాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4, గ్రూప్-డి ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఉంది. వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఛార్టెడ్ అకౌంటెంట్లు-, ఆర్కిటెక్టులు, అలాగే ఇతర నమోదిత వృత్తి నిపుణులకూ ఈ పథకం వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ప్రధానంగా కౌలు రైతులకు మేలు చేసేలా దీనిని రూపొందించారు.

# రాజీవ్ యువ వికాసం కింద లబ్దిదారుల ఎంపిక

- కసరత్తు మొదలు పెట్టిన ప్రభుత్వం
- సిబిల్ స్కోరు ఆధారంగా లబ్దిదారుల గుర్తింపు

**హైదరాబాద్,మే5( వెలుతురు):**

రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్దిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే




ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీ-ల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

# ఎండల తీవ్రతతో తగ్గిన కూరగాయల సాగు

- కూరగాయల ధరల్లో పెరుగుదల

**హైదరాబాద్,మే5( వెలుతురు):**

మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికితోడు దిగుబడులు కూడా తగ్గాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. అకాల వర్షాల వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. అకాల వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. బీర కిలో రూ.80కి పెరిగిపోయింది. అది రిటేల్ మార్కెట్లో వంద వరకు అమ్ముతున్నారు. అంటే రెట్టింపుయింది. బెండ కిలో రూ.రూ.60కి పెరిగింది. అది రిటేల్‌లో 20కి పావు కిలో అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలుదాదాపు రెండు రెట్లు పెరిగింది. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో అకాల వర్షాలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు.



(ఆధ్యాత్మిక చింతన )

# మంచివారితోనే స్నేహం మంచిది !



**తిరుమల,మే5( వెలుతురు):**

మంచి వ్యక్తులతో స్నేహం... ఎప్పుడూ సత్యమే పలికేలా చేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. కల్మషాలను పోగొడుతుంది. మనసును నిర్మలంగా ఉంచుతుంది. పేరు ప్రతిష్టలు పెరిగేలా చేస్తుంది. మనోవికాసాన్ని కలిగిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... సజ్జనులైన వారి సాంగత్యం సకలార్ధ సాధనం అని పెద్దలు చెబుతారు. అలా ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి. ప్రేమ అంటే ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ఉండేదేనా, ఉద్భవించేదేనా? కాదు. ప్రేమకు పరిమితి లేదు. హద్దుల్లేవు. గోడలు, పై కప్పు, తలుపులు, తాళాలు... ఏమీ లేవు. స్వేచ్ఛగా, ఎప్పటికీ రెక్కలు తెగని పక్షిలా దిగంతాలకు, అనంతాలకు ఎగిరిపోయే ఒక అమృత కెరటం. అయితే అది అపురూపమైనదే గానీ ఎవరికీ అందుబాటులోకి రానిది మాత్రం కాదు. దాన్ని అందరూ అనుభవించవచ్చు. అనుభూతించవచ్చు. అదే దాని ప్రత్యేకత. నిజానికి ఈ లోకం ఇంత సజావుగా నడుస్తోందంటే దానికి కారణం, మూలం... ప్రేమే. ప్రేమ... భగవంతుడి ప్రతిరూపమే. ఆయన కల్యాణ గుణమేఇంత అద్భుతమైన ప్రేమను నిత్యజీవితంలో అనుభవిస్తున్న లోకం ఎంతో ఆనందంలో ఓలలాడాలి కదా... మరి ఈ దుఃఖం ఏమిటి, ఈ విషాదం ఏమిటి? మనుషుల్లోని స్వార్థం, మూర్ఖత్వం, దురాశ... ఈ దుర్గుణాలవల్ల వంచనకు గురవుతున్నామన్న సత్యం అమాయకులమైన మనకర్థం కాదు. అర్థమయ్యేసరికి మన జీవితమే ముగిసిపోతుంది.

## బిజెపి యాచారం మండల అధ్యక్షులుగా జరుపుల విజయ్ నాయక్

- అవకాశం కల్పించిన పార్టీ కి ధన్యవాదములు
- జరుపుల విజయ్ నాయక్



**యాచారం వెలుతురు మే 05:** తక్కళ్లపల్లి తండా గ్రామ పంచాయతీ చెందిన జరుపుల విజయ్ నాయక్ గారికి యాచారం మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించిన పార్టీకి.... గిరిజన వ్యక్తి, న్యాయవాది కి అవకాశం కల్పించిన పార్టీ, బిజెపి లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అవకాశం ఉంటుందని, అవకాశం కల్పించిన పెద్దలకు ధన్యవాదములు తెలిపారు.. తక్కళ్లపల్లి తండా ఉప సర్పంచ్ గా పనిచేసారు.. జిల్లా అసెంబ్లీ స్థాయిలో లీగల్ సెల్ లో బాధ్యతలు నిర్వర్తించడం జరిగింది.. 2020 సంవత్సరంలో బిజెపి లో చేరిక.. పార్టీ లో క్రియాశీల కార్యకర్తగా గుర్తింపు.

## ఎక్కడ చూడని పంటలు జహీరాబాద్ కే సొంతం

- శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు...





**జహీరాబాద్ వెలుతురు మే 05:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు తమ గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమం లో భాగంగా వారి మూడు నెలల గ్రామీన శిక్షణ ముగింపు సందర్భంగా రంజోల్ రైతు వేదిక లో రైతు అవగాహన సదస్సు నిర్వహించి వివిధ స్టాల్ ఏర్పాటు చేశారు. తమకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఇక్కడ సాగు చేసే పంటలు మరెక్కడా ఉండవని ఎక్కడ చూడని పంటలు ఈ జహీరాబాద్ కే సొంతమని కొనియాడారు. ఫల పరిశోధన కేంద్రం సంగారెడ్డి ప్రధాన శాస్త్ర వేత్త సుచిత్ర మాట్లాడుతూ ఇక్కడికి ఈ బ్యాచ్ 4వ బ్యాచ్ అని ఇప్పటి వరకు 200 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని వెళ్ళారు అని అదేవిధంగా తర్వాత వచ్చే వాళ్ళకి కూడా ఈ ప్రాంతానికి కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ప్రతి విద్యార్థి 5 మట్టి నమూనాలు చొప్పున 200మట్టి పరీక్షలు చేసి భూసార పరీక్ష ఫలితాల కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఫల పరిశోధన కేంద్రం సంగారెడ్డి ప్రధాన శాస్త్ర వేత్త సుచిత్ర, మాధవి, లావణ్య, నితీష్, ప్రొఫెసర్ నిరోష, ఉద్యాన అధికారి మోనికా, కే వి కే భూసార నిపుణులు స్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, విద్యార్థులు మహాలక్ష్మి, సాత్విక, వర్ష, మానస, ప్రియాంక, యామిని, జ్యోతి, సప్న, కాత్యాయని రవీనా, రైతులు వీరారెడ్డి, జగన్, కృష్ణ, రాజు, ఎల్లారెడ్డి, సంజీవ్ రెడ్డి, ఫిరోజ్, సంగప్ప, రమేష్ రెడ్డి, సంజీవ్, మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2 లక్షల రూపాయల ఎల్ఓసి ని అందజేసిన మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ



**జహీరాబాద్ వెలుతురు మే 05:** ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగారెడ్డి జహీరాబాద్ మండలం బూర్దిపాడ్ గ్రామానికి చెందిన గుమ్మల్లా బాలరాజుకి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి కింద 2 లక్షల రూపాయల ఎల్ఓసి కాపీని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశాలమేరకు వారి కుటుంబ సభ్యులకు జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు పెంటా రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్రహం, నాయకులు దత్తు రెడ్డి, పిజి శంకర్ తదితరుల సమక్షంలో అందజేశారు. ఈ సంధర్భంగా 2 లక్షల రూపాయల ఎల్ఓసి కాపీని అందుకున్న లబ్దిదారుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి, మండల పార్టీ అధ్యక్షునికి , మాజి ఆత్మ చైర్మన్ పెంట రెడ్డికి, గ్రామ సర్పంచ్ కి, గ్రామ బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బూరుగు వెంకటేష్ ని పరామర్శించిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు రాపోలు నరసింహ

- మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగు, కార్యకర్తలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 5**



ఇటీవలన స్వర్గస్తురాలైన నవతెలంగాణ రిపోర్టర్ బూరుగు వెంకటేశం, వారి తల్లి పరమపదించారు. రామన్నపేట లోని వారి స్వగృహంలో కలసి తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా, రామన్నపేట తెలుగుదేశం పార్టీ మండల శాఖ బాధ్యులు మిర్జా ఫజల్ బేగ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా చేనేత సహకార సంఘాల అధ్యక్షులు అప్పం రామేశ్వరం, తెలుగుదేశం పార్టీ చేనేత నాయకులు గోసిక చక్రపాణి, రామన్నపేట బీసీ సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, రామన్నపేట పట్టణ శాఖ అధ్యక్షులు దిండుగల రాములు, రామన్నపేట తెలుగుదేశం పార్టీ మండల అధికార ప్రతినిధి బత్తుల సత్యం, చేనేత నాయకులు జెల్ల లక్ష్మీనారాయణ, నాయకులు వడ్లకొండ సత్తయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బూరుగు వెంకటేశం తల్లి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## సరస్వతి శిశు మందిర్ 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**జహీరాబాద్ వెలుతురు మే 05:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని సరస్వతి శిశు మందిర్ 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. చదువొక్కటేనా.. విద్యతో పాటు బుద్ధులు బుద్ధులతో పాటు విలువలు..క్రమశిక్షణా కట్టుబడి దేశభక్తి జాతీయభావనను నరనరమున నింపి...వినయవిధేయతలు, ధర్మనిష్టా సత్సాంప్రదాయ సదాచారాలు కణకణమున అలవర్చిన మన బడి...బడి కాదు అది వ్యక్తిత్వ నిర్మాణ ధర్మక్షేత్రం సమాజ నిర్మాణ కార్య క్షేత్రం మనందరిలో ఏకాత్మతా భావనను నింపిన దైవ క్షేత్రం..బడి కాదు అది బ్రతుకు నేర్పిన అమ్మ ఒడి..మన శిశు మందిర్ గుడి..! ఆ దైవ క్షేత్రం..ఆ ధర్మక్షేత్రం..ఆ కార్య క్షేత్రం..స్మరిస్తూ శారదామాతా ఒడిలో స్నేహితులు కలుసుకుని వాళ్ళ బాల్యపు మధుర స్మృతులను, మరపురాని అనుభవాలను వారి ఆచార్యులతో పంచుకున్న సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు. మన పాఠశాల 2000-2001 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత బాల్య మిత్రులు అంతా ఒక్కటిగాఏర్పడి చిన్న నాటి మధుర జ్ఞాపకాలను అందరితో కలసి పంచుకున్నారు. పాఠశాలలో దాదాపు 4 లక్షల వ్యయంతో 2 తరగతి గదులను మరియు రేలింగ్ వేయించి ఆధునీకరించడం జరిగిందని పాఠశాల అధ్యక్షులు సాయి రెడ్డి విఠల్ రెడ్డి అన్నారు. పాఠశాల తిరిగి పునర్ వైభవంలోకి రావడానికి పూర్వవిద్యార్థులు, పూర్వ ఆచార్యులు అన్ని విధాలుగా సహకరిస్తున్నందుకు వారందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానాచార్యులు గోకుల కృష్ణయ్య, పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులు గిరీష్, మహేష్ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 5 :** మున్సిపల్ పరిధి లో భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ జాతీయ రహదారి రోడ్డు వెంట ఉన్న సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ సర్వీస్ రోడ్డులో అక్రమ కట్టడాల నిర్మాణం జరుగుతున్న వాటిని తొలగించాలని, వాటికి పరిమిషన్ ఎలా ఇచ్చారు అని అడుగుతూ ఎమ్మార్వో ఆఫీస్ వెళ్లేదారిలో సర్వీస్ రోడ్డు లేక ప్రయాణికులు ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని ఎద్దేవా చేశారు, ధర్నా అనంతరం మండల రెవెన్యూ తాసిల్దార్ కు వినతి పత్రం ద్వారా త్వరగా సర్వీస్ రోడ్డు పనులు జరిగే విధంగా, అక్రమ కట్టడాల నిర్మాణం తొలగించాలని బిజెపి నాయకులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్, మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్, బత్తుల జంగయ్య గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకాని మలేష్ యాదవ్, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, భాతరాజు సత్యం, మునగాల తిరుపతిరెడ్డి, రిక్కల సుధాకర్ రెడ్డి, ఉడుగు వెంకటేశం గౌడ్, యాదయ్య గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, దిండు భాస్కర్, పబ్బు వంశీ, ఉష్కాగుల నాగరాజు, వనం ధనంజయ, కడారి ఐలయ్య యాదవ్, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, గట్టు మొగలయ్య, మునగాల అమరేందర్ రెడ్డి, కొండూరు దుర్గయ్య, నల్ల శివప్రసాద్, పాలెం అశోక్ కుమార్, కానుగు శేఖర్, వంగాల రాము తదితరులు పాల్గొన్నారు .

## సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 5 :** మున్సిపల్ పరిధిలో ఎండి జహంగీర్ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి, కష్టాల కొలిమిలో కాలిన జీవితం శ్రామిక జనచైతన్యమే తన ధ్యేయం సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్ అని, కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా సోమవారం రోజు చౌటుప్పల మున్సిపాలిటీలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన మార్క్స్ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జహంగీర్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం, కృషి చేసిన సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ అని అన్నారు, జర్మన్ శాస్త్రవేత్త తత్వవేత్త, ఆర్థికవేత్త సామాజికవేత్త పాత్రికేయుడు సోషలిస్టు విప్లవకారుడు కార్ల మార్క్స్ అని, సమాజం ఆర్థిక శాస్త్రం. మార్క్సిజన్ ప్రధానంగా రాజకీయాల వంటి వాటిపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజంగా పిలుస్తున్నారు మార్క్సిజం ప్రధానంగా మానవ సమాజలు వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందాయని, మార్క్స్ కార్మిక వర్గ పెట్టుబడిదారీ వ్యవస్థలను కూలదోసి సామాజిక ఆర్థిక విముక్తి తీసుకువచ్చేందుకు సంఘటితంగా విప్లవ చర్య చేపట్టాలని వాదిస్తూ క్రియాశీలంగా దాని ఆచరణ కోసం పోరాడాలి అని అన్నారు , మార్క్సిస్టు మేధావి, కార్మిక వర్గ సిద్ధాంతకర్త కామ్రేడ్ కార్ల్ మార్క్స్ జయంతి నిర్వహించుకోవడం, అతని ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బూర్గు కృష్ణారెడ్డి, గోశిక కరుణాకర్, రాగిరి కిష్టయ్య, నాయకులు బొజ్జ బాలయ్య, బత్తుల దాసు. ఉస్కా గుల శ్రీను, బొడ్డు రాజు, బోయ యాదయ్య, ఎండి. ఖయ్యూం, భావనలపల్లి స్వామి, కందగట్ల ఆనంద్, కల్వకుంట్ల శివ, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బత్తుల రమేష బత్తుల జయమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## మిస్సింగ్ కేసు నమోదు

**రామన్నపేట వెలుతురు న్యూస్**



ఇందు మూలముగా పత్రిక విలేకరులకు తెలియజేయునది. ఏమనగా పిర్యాదు అయిన రామన్నపేట గ్రామానికి చెందినా పిట్టల దివ్య భర్త పిట్టల సందీప్ వయస్సు 23 సంవత్సరాలు ప్రతి రోజు చౌటుప్పల్ మండలం లోని లింగోజీగూడ నందు ఉన్న పెట్రోల్ బంకులో పని చేయడానికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివస్తాడని. తేది 28.04.2025 రోజు ఉదయం 07.00 గంటలకు పెట్రోల్ బంకు కు పనికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళిన పిర్యాది భర్త పిట్టల సందీప్ సాయంత్రం వరకు రాలేదని. ఫోన్ చేస్తే స్విచ్ అప్ వస్తున్నదని. చుట్టుపక్కల వెతికినా కూడా జాడ తెలియరాలేదని, పిర్యాదు రాగ కేసు నమూదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నానని, ఎస్సై మల్లయ్య రామన్నపేట ఒక ప్రకటనలో తెలిపినారు.

## పదవీ విరమణ చేపట్టి స్వస్థలానికి వచ్చిన దేశ సైనికుడు వకులభరణం శ్రీధర్ కి ఘన స్వాగతం...

ఘనంగా సన్మానించిన శ్రీ వెంకటేశ్వర కాలనీవాసులు...



**తిమ్మాపూర్ వెలుతురు మే 05:** తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీకి చెందిన వకులభరణం శ్రీధర్ భారత ఆర్మీలో 26 సంవత్సరాల పాటు వివిధ హొదాల్లో పనిచేసి పదవి విరమణ చేసి స్వస్థలానికి వచ్చిన నేపథ్యంలో కాలనీవాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర కాలనీ వాసులు ముందుగా టపాసులు పేల్చిశ్రీధర్ దంపతులకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించి , కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశ సేవకు అంకితమై భారత సైన్యంలో 26 సంవత్సరాలుగా నాయక్, సుబేదార్ గా వివిధ రాష్ట్రాలలో జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, ఈశాన రాష్ట్రాలతో విధులు నిర్వహించినట్లు తెలిపారు. దేశ రక్షణ కోసం ఇన్నేళ్లుగా వివిధ హొదాల్లో ఆయా ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన, మాజీ ఆర్మీ సైనికుడిగా దేశ రక్షణ కోసం తన వంతు సేవ చేయడానికి ఎప్పుడు సిద్ధమేనని శ్రీధర్ అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ ప్రజలు, మాజీ సైనికుడు శ్రీధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సిబిల్ స్కోర్ ఉంటేనే రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులు అనడం సరికాదు

- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 05:**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ తో ముడిపెట్టడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలు ఎగోడుతున్న పారిశ్రామికవేత్తలకు. బడా బాబులకు, కాంట్రాక్టర్లకు బ్యాంకులు,ప్రభుత్వాలు వత్తాసు పలుకుతూ వారు దొంగలు అని తెలిసిన వారు అడిగిందే తడువుగా వందల కోట్ల రూపాయలు ఎలాంటి పూచికత్తులు లేకుండా రుణాలు ఇస్తున్నప్పుడు బడుగు బలహీన వర్గాల వారికి రుణాలు ఇస్తానికి మాత్రం ప్రభుత్వాలు కొర్రీలు పెట్టడం ఏ మాత్రం సబబు కాదని ఆయన అన్నారు అంతేకాకుండా గతంలో తీసుకున్నటువంటి వ్యక్తిగత రుణాలకు ప్రభుత్వం ఇప్పుడు యువ వికాసం ఇచ్చే రుణాలకు మెలిక పెట్టే ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నాం.

## మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో మాతృ వందనం

**కరీంనగర్ వెలుతురు మే 05:**






మాధవ సేవాసమితి కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో భాగంగా బాల సంస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 5 సంవత్సరాలుగా ప్రతి ఏటా జరుగుతున్న మాతృ వందన సంస్కార కార్యక్రమంలో భాగంగా బాల బాలికలకు తల్లిదండ్రుల విశిష్టతను తెలియజేస్తూ , ప్రథమ దైవము తల్లిదండ్రులేనని , వారిని పూజించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రోగ్రాం లో భాగంగా నిర్వాహ కులు మధుసూదన్ రావు ఈ శిబిరంలో పాల్గొన్న పిల్లలకు యోగ, ధ్యానం, భజన, దేశభక్తి పాటలు, వేద గణితం లతోపాటు ఆకట్టుకునే , స్ఫూర్తినిచ్చే ఒక కథ అంశంతో , స్ఫూర్తినిచ్చే విషయాలను తెలిపారు. ప్రధాన వక్తగా హాజరైన సుధాకర్ తరిగిపోతున్న కుటుంబ విలువలు పెంపొందించుకోవడం యొక్క ఆవశ్యకత, భారత కుటుంబ వ్యవస్థ, మన ధర్మం పద్ధతుల పై పిల్లలకు అవగాహనను కల్పించే విషయాలను తెలియజేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన మాధవ సేవా సమితి అధ్యక్షులు సిఏ నిరంజన్ చారి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ లో ముఖ్యంగా పిల్లలపై టీవీ సీరియల్, సెలబ్రిటీ షోలు వాటి దుష్ప్రభావాలు గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తల్లిదండ్రులు మాట్లాడుతూ ధార్మికత, పెద్దల పట్ల గౌరవం, దేశభక్తి, మంచి క్రమశిక్షణ వంటి మార్పులు తమ పిల్లల కు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఇట్టి కార్యక్రమంలో నగర కార్యవాహ చామా మహేశ్వర్ , తదితరులు పాల్గొన్నారు.

# ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారు?

కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం

తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంది?

నక్సల్స్ సానుభూతిపరులు హరగోపాల్, వరవరరావు సాధించిందేమిటి?

దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?

తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే...జనజీవన స్రవంతిలో కలవాల్సిందే

పౌరహక్కుల సంఘం నేతలారా...నక్సల్స్ కు నచ్చజెప్పండి

రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదు

కేవలం సర్వే మాత్రమే జరిపింది

బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది

ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన

జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుంది

బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతాం

పెద్దపల్లిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్...



**పెద్దపల్లి వెలుతురు మే 05:**
నక్సల్స్ పై నిషేధం విధించిన కాంగ్రెస్ పార్టీయే ఈరోజు నక్సల్స్ తో చర్చలు జరపాలని చెప్పడం
ఆ పార్టీ రెండు కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే సామాజిక కోణంతో చూడాలనడం బాధాకరమన్నారు. తుపాకీ పట్టి చంపేటోళ్లతో చర్చలేందని ప్రశ్నించారు. దశాబ్దాలుగా నక్సల్స్ చేసిన హింసతో ఎంతో మంది చనిపోయారని, నెత్తురోడిన ఎన్నో ద్రుశ్యాలను చూసిన ప్రొఫెసర్ హరగోపాల్, వరవరరావు సాధించిందేమిటో చెప్పాలన్నారు. నక్సల్స్ తుపాకీ వీడి లొంగిపోవాల్సిందేనని, జనజీవన స్రవంతిలో కలవాల్సిందేనని ఉద్ఘాటించారు. ఈ విషయంలో హరగోపాల్, వరవరరావుసహా పౌరహక్కుల సంఘం నేతలే నక్సల్స్ కు నచ్చజెప్పాలని సూచించారు.

సోమవారం రోజున మధ్యాహ్నం కాగజ్ నగర్ నుండి కరీంనగర్ వెళుతూ మార్గమధ్యలో రామగుండంలోని ఎన్టీపీసీ వద్ద కాసేపు ఆగారు. స్థానిక బీజేపీ నేతలను కలిశారు. అనంతరం అక్కడికి వచ్చిన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే...

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లలో తెలంగాణ అభివృద్ది కోసం రూ.12 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసంది. ఒక్క నేషనల్ హైవేస్ అభివృద్ధి కోసమే 1 లక్షా 25 వేల 485 కోట్ల ఖర్చు చేసినం. ఇవిగాక రైల్వేల అభివృద్దిక రూ.32 వేల కోట్లు ఖర్చు చేసినం. వడ్ల కొనుగోలు కోసమే లక్షనర్న కోట్ల రూపాయలదాకా ఖర్చు చేసినం. మేం ఇంత చేసినా కేంద్రం నయాపైసా ఇయ్యలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. కేంద్రం ఖర్చు చేసిన నిధులపై లెక్కా పత్రంతోసహా వివరిస్తాం. చర్చకు రావాలని కోరినా వాళ్లు రావడం లేదు.
6 గ్యారంటీలపై కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. వీటి గురించి ప్రస్తావిస్తుంటే ప్రజల ద్రుష్టిని మళ్లించేందుకే కేంద్రంపై దుష్ప్రచారం చేస్తోంది. కులగణన పేరుతో డ్రామాలాడుతోంది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయనేలేదు. చేసిందల్లా సర్వే మాత్రమే. సర్వే అంటే తూతూ మంత్రంగా వెళ్లి డేటా తీసుకోవడం. రాష్ట్రంలో 50 శాతం ఇండ్లకు కూడా వెళ్లలేదు. జనాభా లెక్కలకు సర్వేకు పొంతనే లేదు. సమగ్ర కుటుంబ సర్వేకు, కుల సర్వేకు పొంతనేలేదు. కుల సర్వేతో బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది. 52 శాతం జనాభా ఉంటే 46 శాతానికి కుదించింది. 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు కేటాయించి దారుణంగా మోసం చేసింది. దీనిని ద్రుష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం జనగణన మాదిరిగా ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తుంది. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దబోతోంది. బీసీల వాస్తవ జనాభాను తేల్చబోతోంది.
మేం వాస్తవాలు చెబుతుంటే... ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి చర్చలు జరపాలంటూ కొత్త నాటకం మొదలు పెట్టారు. అసలు నక్సల్స్ ను నిషేధించిందే కాంగ్రెస్ ప్రభుత్వం. ఇయాళ నక్సల్స్ మెప్పు పొందడానికి కేసీఆర్, రేవంత్ రెడ్డి పోటీలు పడి పొగుడుతున్నారు. పదేళ్లు పాలించిన కేసీఆర్, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నక్సల్స్ పై నిషేధాన్ని ఎత్తివేసే దమ్ముందా? అయినా తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతున్న వాళ్లతో చర్చలేంది? వాళ్లతో మాటల్లేవ్...మాట్లాడుకోవడాల్లేవ్.
ప్రొఫెసర్ హరగోపాల్, వరవరరావును అడుగుతున్నా. ఎన్నో హత్యలను, చావులను చూశారు. ఎంతో మంది అమాయకులు, పోలీసులను కాల్చి చంపడాన్ని, నెత్తురోడిన ద్రుశ్యాలను చూశారు. మరి ఇన్ని దశాబ్దలుగా మీరు సాధించిందేమిటి? శాంతి భద్రతల సమస్యను ముఖ్యమంత్రి సామాజిక కోణంతో చూస్తామని చెప్పడం కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. అంతెందుకు ఆనాడు టీడీపీలో రేవంత్ రెడ్డి ఉన్నప్పుడే నాటి సీఎం చంద్రబాబుపై నక్సల్స్ అలిపిరి వద్ద బాంబులు పేల్చి చంపాలని చూసింది నిజం కాదా? అజాత శత్రువు శ్రీపాదరావును చంపింది నిజం కాదా? కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, రాగ్యానాయక్ ను చంపింది నక్సల్స్ కాదా? జాతీయ జెండా ఎగరేసినందుకు సామా జగన్మోహన్ రెడ్డిని కాల్చి చంపిన నక్సల్స్ నల్ల జెండాలు ఎగరేసి దేశద్రోహం చేయలేదా?
మహాముత్తారంలో ఎస్ఐ భార్య శ్రీమంతం చేసుకునే సమయంలో బాంబులు పెట్టి నక్సల్స్ ఆ ఎస్ఐని చంపేశారు. అప్పుడే కానిస్టేబుల్ ను చంపేశారు. దూరదర్శన్ జర్నలిస్టును చంపేశారు. బీజేపీ నాయకులు సామ జగన్మోహన్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, రామన్నగోపన్నలను చంపేశారు. అంతెందుకు మీ కాంగ్రెస్ నాయకులను ఎంతో మంది చంపేశారు. శ్రీపాదరావు వంటి అజాత శత్రువును కూడా నక్సల్స్ చంపేశారు. బాంబులు అమర్చి పోలీసులను తునాతునకలు చేసి నక్సల్స్ చంపుతుంటే రేవంత్ రెడ్డి, కేసీఆర్ సమర్ధిస్తారా?... గిరిజనులను, అమాయక ప్రజలను ఇన్ ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సమర్ధిస్తారా? సమాధానం చెప్పాలి. మేం మాత్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదు. తుపాకీ వీడాల్సిందే. పోలీసులకు లొంగిపోవాల్సిందే. వారి వైఖరి మారాల్సిందే. వాళ్లతో చర్చలు జరిపే సందర్భమే రాదు. ఈ విషయంలో నక్సల్స్ ను హరగోపాల్, వరవరరావుసహా పౌరహక్కుల సంఘం నాయకులే నచ్చజెప్పాలి.

# అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోండి..

- కలెక్టర్ తో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి
- సీఎం, గవర్నర్లకు పోస్ట్, మెయిల్ ద్వారా వినతి పత్రాల సమర్పణ..



**కరీంనగర్ వెలుతురు మే 05:**
భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయలను బహిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం రోజున జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ కు పోస్ట్ , మెయిల్



ద్వారా వినతి పత్రాన్ని పంపించారు. బిజెపి జిల్లా శాఖ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, సీఎం, గవర్నర్ కి వినతి పత్రంలో విన్నవించిన ప్రధాన అంశాలు ఏమిటంటే... పాకిస్తాన్ మద్దతుతో ఆశ్రమం పొందిన ఉగ్రవాదులు 2025 ఏప్రిల్ 22న కాశ్మీర్లోని పహల్గామ్ ప్రాంతంలో క్రూరమైన దాడికి పాల్పడడంతో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఈ దారుణ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని, ఐఎస్ఐ, పాకిస్తాన్, ఇంటలిజెన్స్ ఏజెన్సీ, అక్కడి సైన్యం ఆదేశాల మేరకు ఈ క్రూరమైన దాడి ప్రణాళిక బద్ధంగా జరిగిందనే సమాచారాన్ని తెలియజేశారు. ఈ హేయమైన చర్యతో దేశ ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతుందని, ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్తాన్ చర్యలకు వ్యతిరేకంగా అనేక దేశాలు భారత్ కు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై మునుపెన్నడు లేనివిధంగా కఠినమైన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకొని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే సంస్థలు, దేశాల పై కఠిన వైఖరితో ఉన్నారని, ఆ దిశలో సంకల్పాన్ని నెరవేర్చేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని పేర్కొన్నారు. ఈ విషాదకర ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సింధు నది జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం, పాకిస్తాన్తో దౌత్య సంబంధాలను తగ్గించి పరిమితం చేయడం, పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేయడం, పరిమిత గడువులోగా వారిని దేశం నుండి బహిష్కరించడం వంటి అనేక చర్యలు తీసుకుందని వివరించారు. అలాగే ఏప్రిల్ 25వ తేదీన హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం, ఫారిన్ యాక్ట్ నిబంధనల అధికారాలను ఉపయోగించి, పాకిస్తానీ దీర్ఘకాలిక పౌరులకు వీసా సేవలను నిలిపివేయాలని నిర్ణయించారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని, గడువు ముగిసిన వీసాలు కలిగి ఉన్న , వీసాలు సస్పెండ్ చేయబడిన పాకిస్తానీ జాతీయులు అందరినీ వెంటనే గుర్తించాలని కోరారు. ఈ మొత్తం విషయం జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన , తీవ్ర అంశమైనందున అలాంటి వ్యక్తుల వివరాలను జాబితా చేసి వెంటనే వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గంగా డి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అనంతరం గంగాడి కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ గతంలో జిల్లాలో ఉగ్రవాదుల కదలికల విషయాన్ని , జరిపిన పలు దాడుల అంశాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసి ప్రస్తావించారు. జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను ఆ దేశానికి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అలాంటి వారందరినీ గుర్తించి , తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్టు చెప్పారు. ఇట్టి ప్రోగ్రాంలో మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి , మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావ్, కటకం లోకేష్, వైద రామానుజం, బండ రమణారెడ్డి, లెక్కల వేణుగోపాల్, దండు కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, సొల్లు అజయ్ వర్మ, ప్రవీణ్ , లడ్డు ముందడ, చిట్టిబాబు, పొన్నాల రాము, దేవి శెట్టి నవీన్, శ్రీకాంత్ లతోపాటు మహిళా నాయకురాలు మామిడి చైతన్య, బండారి గాయత్రి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు..

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**
అమరాబాద్ మండలంలోని అన్ని గ్రామాల అభ్యర్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఈనెల 07 తేదీ నుండి 12 వ తేదీ వరకు ఇంటర్వ్యూ లు జరుగుతాయని ఎంపీడీవో జగదీశ్వర్ తెలిపారు. తేదీ : 7న మైనార్టీ కార్పొరేషన్ 08న ST కార్పొరేషన్, 09న BC కార్పొరేషన్ 12న SC కార్పొరేషన్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన తెలిపారు లబ్ధిదారులు ఇంటర్వ్యూలో పాల్గొని సంబంధిత అర్హత కలిగిన ఒరిజినల్ సర్టిఫికెట్స్,రెండు జతల జతల కాపీలు జిరాక్స్ తీసుకు రమ్మని ఉదయం 10-30 గంటలకు నుండి ఇంటర్వ్యూలు జరుగుతాయని అన్నారు. ఇట్టి ఇంటర్వ్యూలో ఎస్బిఐ దోమలపెంట, మన్ననూర్, అమ్రాబాద్, బ్రాంచ్ మేనేజర్లు, కార్పొరేషన్ కన్సల్ట్ అధికారులు.మరియు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రజిని తదితరులు పాల్గొంటారని అన్నారు.




## డంపు యార్డ్ ను తక్షణం తొలగించడానికి చర్యలు చేపట్టండి..

- జిల్లా కలెక్టర్ తో 9వ డివిజన్ కోతి రాంపూర్ ప్రజలు, వివిధ కాలనీవాసులు...
- కరీంనగర్ పట్టణం చెత్తంతా మా ప్రాంతంలో వేసి ఇబ్బంది పెడుతున్నారు...
- కరీంనగర్ అంతట పార్కులు, ఓపెన్ జిమ్ సెంటర్లు పెట్టి మా ప్రాంతాన్ని చెత్త డంపు యార్డ్ కేంద్రంగా మార్చారు...








**కరీంనగర్ వెలుతురు మే 05:**
కరీంనగర్లోని డంపు యార్డు ను తొలగించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని కోరుతూ తొమ్మిదో డివిజన్ కోతి రాంపూర్ ప్రజలు సోమవారం రోజున ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ ప్రజలు, స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్ కి డంపు యార్డ్ వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కరీంనగర్ పట్టణంలోని మొత్తం చెత్తను ఇక్కడికి పంపిస్తూ ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ కు కేంద్ర బిందువుగా మార్చారని తెలిపారు. పట్టణంలోని అనేక డివిజన్లో జిమ్, వాకింగ్ ట్రాక్స్ , ఆహ్లాదకరమైన పార్క్ లు ఏర్పాటు చేస్తే ఇక్కడి 9వ డివిజన్ ప్రాంతాన్ని మాత్రం పట్టణంలోని చెత్త కేంద్రంగా, డంపింగ్ యార్డ్ గా మార్చారని పేర్కొన్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల ప్రజలు ఆహ్లాదకరమైన జీవనాన్ని కొనసాగిస్తే, తామంతా అనునిత్యం ఇబ్బంది పడుతూ, అనారోగ్యాల బారిన పడే పరిస్థితులు వచ్చాయన్నారు. డంపు యార్డ్ వల్ల రాంపూర్ ప్రజల జీవన పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. దట్టమైన పొగలు, చెత్తాచెదారం , వ్యర్థాలు, కుళ్ళిపోయిన పదార్థాల దుర్వాసనలతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు జీవించలేని పరిస్థితిలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. 9వ డివిజన్ ప్రజలను పట్టిపీడిస్తున్న డంపు యాడు సమస్య పరిష్కారాన్ని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడానికి ప్రభుత్వం, జిల్లా అధికారులు , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ సత్వరం చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక ప్రజల ప్రాణాలకు ముప్పుగా తయారై గుట్టలు గుట్టలుగా పేరుక పోయిన చెత్త ను తొలగించి, కోతి రాంపూర్ నుండి డంపింగ్ యార్డ్ ను తక్షణం తొలగించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే సమస్య పరిష్కారం కోసం డంప్ యార్డ్ బాధితుల సంఘం, కరీంనగర్ జేఏసీ పేరిట ఇకపై పోరాటాలను ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## చివరేజ్ మరియు డ్రైనేజ్ బండ్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 05:**
సోమవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్లోని సుశీల్వాడి, నజీర్ బాగ్, సంజయ్ గాంధీ నగర్, ఇందిరానగర్, షంషీర్బాగ్ మొదలైన ప్రాంతాల్లో చివరేజ్ మరియు డ్రైనేజ్ బండ్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, మహేష్, జగదీష్, సందీప్ ధరలు పాల్గొన్నారు

## లావుడియా కుమారి రాజు నాయక్ నూతన గృహప్రవేశానికి హాజరైన బంధుమిత్రులు



**వెలుతురు హనుమకొండ జిల్లా మే 05:**
హనుమకొండ జిల్లా గోపాలపురం శివ సాయి కాలనీ లో లావుడియా కుమారి రాజు నాయక్ నూతన గృహప్రవేశానికి హాజరై సత్యనారాయణ వ్రతం శివ కళ్యాణం లో పాల్గొన్న లావుడియా తారా బాయి శారద రామ్ నాయక్ సరోజన వనిత గోవర్ధన్ విజయ హేమ నాయక్ పల్లవి రాజు నాయక్ సరిత గణపతి సునీత సునీల్ కల్పన గోపాల్ కవిత జైపాల్ కుమారి రాజు నాయక్ సంధ్య సందీప్ సుజాత ఉదయ్ సింగ్ మమత సంతోష్ సరిత జల్ సింగ్ అజ్మీర ఆనంద దేవి రవి నాయక్ హట్కర్ రజిత రాజన్న అజ్మీర వసంత చీమన్ నాయక్ మాలోతు సునీత హనుమంతు తిరుపతి ఫుల్ బంద్ గంగు నాయక్ రతన్ సింగ్ బాబు నాయక్ కళ్యాణ్ మొదలైన వారు పాల్గొని శుభాకాంక్షలు తెలపడం జరిగింది

# వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**గాజుల రామారం వెలుతురు మే 05:**
సోమవారం రోజున 125 – గాజుల రామారం డివిజన్ "ఒక్షిత హిల్ వ్యూ" కాలనీలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు అధికారులతో కలిసి పర్యటించి కాలనీలో నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ, వరదనీటి సమస్యను పరిశీలించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలనీలో నెలకొని భూగర్భ డ్రైనేజీ, వరద నీటి సమస్యకు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్.ఈ.చెన్నారెడ్డి, ఈఈ కిష్టప్ప, వాటర్ వర్క్స్ అధికారులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఒక్షిత హిల్ వ్యూ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణ, సురేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

**హైదరాబాద్,మే5( వెలుతురు):**
జధాని నగరం హైదరాబాద్‌లో సోమవారం రాత్రి సమయానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాత్రి 8.30 నుంచి నెమ్మదిగా ప్రారంభమైన వాన జోరందుకుంది. ఫలితంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీగా వాన కురిసింది. మిన్ను విరిగి మీద పడ్డట్టు–గా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. బంజారాహిల్స్, మణికొండ, మెహదీపట్నం, హైటెక్ సిటీ–, అబిడ్స్, కోఠి, బషీర్ బాగ్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీ, కృష్ణానగర్ ప్రాంతాల్లో కూడా చిరుజల్లులు కురిశాయి. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో భారీగానే వర్షం పడింది

## తెలంగాణలో పలుచోట్ల భూప్రకంపనలు




**హైదరాబాద్,మే5( వెలుతురు):**
తెలంగాణలో పలుచోట్ల భూప్రకంపనలు చోటు–చేసుకున్నాయి. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్ పై 3.2 నమోదు అయినట్లు– అధికారులు తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో భూమి కంపించినట్లు– సమాచారం అందుతోంది. ఈ భూ ప్రకంపనలు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల సుల్తానాబాద్ లో వచ్చినట్లు– తెలుస్తోంది. అలాగే నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, జన్నారంలో కూడా భూమి కనిపించినట్లు– తెలుస్తోంది. భూమి ఒక్కసారిగా ప్రకంపించడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటికి పరుగులు తీశారు. అయితే ఆస్థి, ప్రాణ నష్టం లాంటి సంఘటనలు జరగలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రధాని కార్యాలయానికి రాహుల్

- సిబిఐ డైరెక్టర్ ఎంపికపై భేటీ

**న్యూఢిల్లీ,మే5( వెలుతురు):**
ప్రధానమంత్రి నరేంద్రమోదీతో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్లో విపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా సీబీఐ డైరెక్టర్ ఎంపికపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అటు–, పహల్గాం దాడికి సంబంధించి పాకిస్థాన్ తో అనుసరించాల్సిన విషయాలపై కూడా వీరిద్ధరి మధ్య చర్చ జరిగినట్టు– సమాచారం. వీటితో పాటు పలు కీలక అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం రాహల్ ప్రధాని కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త చీఫ్‌ని ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ– సమావేశానికి రాహుల్‌తో పాటు– సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త చీఫ్ ఎంపికపై చర్చించినట్లు– తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీ–లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

## ఓటీసీ ఔషధాల జాబితాను ఖరారు చేసే ముందు, ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీ కోసం వెలువరించిన అత్యవసర GSR ఉపసంహరణకు వాటాదారులతో చర్చించాలని AIOCD దాని అనుబంధ సంస్థ TTCDA లు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

**హైదరాబాద్ వెలుతురు మే 05:**
భారతదేశం అంతటా 12.40 లక్షలకు పైగా కెమిస్ట్స్ కు మరియు డ్రగ్గిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (AIOCD), ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ J P నడ్డా జీ, హెల్త్ సెక్రటరీ, హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ కు భారత ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఓవర్-ది-కౌంటర్ (OTC) ఔషధ నియంత్రణకు సంబంధించిన పరిణామాలు వివరిస్తూ మరియు COVID-19 మహమ్మారి సమయంలో జారీ చేయబడిన GSR 220(E) యొక్క నిరంతర దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మెమొరాండంలు సమర్పించింది. ప్రతిపాదిత ఓటీసీ ఔషధాల జాబితా మరియు సంబంధిత నిబంధనలను ఖరారు చేసే ముందు వివరణాత్మక వాటాదారుల సంప్రదింపులు జరపాలని AIOCD అధ్యక్షుడు జె ఎస్ షిండే మరియు ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ తమ మెమొరాండం లో ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు.
అటువంటి చర్యను సరిగ్గా పరిశీలించకపోతే, ఈ క్రింది తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తుందని సంస్థ హైలైట్ చేసింది:
ఉన్న చట్టాల ఉల్లంఘన (డ్రగ్స్ & కాస్మెటిక్స్ చట్టం, ఫార్మసీ చట్టం) హేతుబద్ధం కానీ మాదకద్రవ్యాల వాడకం పెరిగే ప్రమాదం నకిలీ మరియు నాసిరకం మందుల పెరుగుదల ఔషధ నిరోధకత మరియు ప్రతికూల మాదకద్రవ్య ప్రతిచర్యలతో (ADR) ప్రజారోగ్య ప్రమాదాలు
ఇంకా, కోవిడ్ అత్యవసర సమయంలో మందులను డోర్ డెలివరీ చేయడానికి మార్చి 26, 2020న జారీ చేసిన G.S.R. 220(E)ని తక్షణమే రద్దు చేయాలని AIOCD డిమాండ్ చేసింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ నిబంధనను తీవ్రంగా దుర్వినియోగం చేస్తున్నాయని, తప్పనిసరి ఫార్మసిస్ట్ పర్యవేక్షణ మరియు ప్రిస్క్రిప్షన్ నిబంధనలను దాటవేస్తున్నాయని, దీనివల్ల కీలకమైన మందులను తనిఖీ లేకుండా పంపిణీ చేస్తున్నారని సంస్థ ఆరోపించింది.
రెండు అంశాలను డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు (DTAB)కి సూచించాలనే ప్రభుత్వ చర్యను AIOCD స్వాగతిస్తుంది, కానీ కీలకమైన వాటాదారుగా, ఏదైనా తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని చర్చలలో దీనిని చేర్చాలని పట్టుబడుతోంది. "ప్రజారోగ్యాన్ని కాపాడాలని మరియు ఔషధ పంపిణీ చట్టాల సమగ్రతను నిలబెట్టాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము, ముఖ్యంగా భారతదేశ ఔషధ డెలివరీ వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న లైసెన్స్ పొందిన రిటైల్ కెమిస్టులు చర్చలో పాల్గొంటారు" అని AIOCD అధ్యక్షుడు జె. ఎస్. షిండే మరియు గౌరవ ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్, టి టి సి డి ఎ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్, గౌరవ ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ తమ పత్రిక ప్రకటనలో తెలిపారు.

# మౌళిక వసతులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**పేట్ బషీరాబాద్ వెలుతురు మే 05:**
సోమవారం రోజున పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నెలకొని ఉన్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు అధికారులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే ఆలోచనతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు సకల సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి



లబ్ధిదారులకు అందజేశారు. ఇల్లు పొందిన లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు అవసరమైన కనీస అవసరాలను అందించడంలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
మౌలిక వసతుల కల్పనలో భాగంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రవాణా సౌకర్యం, ప్రార్థన మందిరాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు.
ముఖ్యంగా వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి సమస్య కలగకుండా రోజుకు రెండు సార్లు నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలి.
విద్యుత్ సమస్యలలో భాగంగా వీధిదీపాల ఏర్పాటు, ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలి.
లబ్ధిదారులకు సొంతింటి ధీమాను కల్పించడంలో భాగంగా ఇంటి నెంబర్ల కేటాయించాలి.
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోని లబ్ధిదారులకు ప్రార్థనలకై దేవాలయానికి, మసీదు, చర్చి వంటి ప్రార్థన మందిరాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి.
ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్, వివిధ శాఖల అధికారులు, నిజాంపేట్ , బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి.పోచంపల్లి, బహదూర్ పల్లి ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు

- హరీష్‌ను అన్ ఫాలో చేసిన కెటిఆర్
- వైఎస్ బతికుంటే హరీష్ కాంగ్రెస్‌లో ఉండేవారు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే5( వెలుతురు):**
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు ఉన్నాయని.. తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని అన్నారు. హరీష్‌రావును సోషల్ మీడియాలో కేటీఆర్ అన్ ఫాలో చేశారని తెలిపారు. ఆ పార్టీలో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో కుర్చీ పంచాయితీ నడుస్తోందని విమర్శించారు. ఒక వైపు కవిత, మరో వైపు కేటీ–ఆర్, ఇంకోక వైపు హరీష్‌రావు ఇలా గ్రూప్ తగాదా నడుస్తుందని ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి రావడానికి గతంలో ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే హరీష్‌రావు ఇప్పటికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేవారని తెలిపారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి వచ్చే విషయంపై ఏమైనా ఉంటే అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్‌రావు ప్రాముఖ్యం తగ్గిపోయిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీ కులగణన కాంగ్రెస్ పేటెంట్ అని ఆది శ్రీనివాస్ ఉద్ఘాటించారు. గతంలో ప్రతీ పేద వాడికి ఏది కావాలో గుర్తించి కాంగ్రెస్ అందించిందని తెలిపారు. కులగణనపై ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందని.. దానిని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. కుల గణనపై బీజేపీ ఏనాడూ నోరు విప్పలేదని చెప్పారు. తాము కులగణన చేసిన తర్వాత బీజేపీ దిగి వచ్చిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో బీజేపీ కుయుక్తులు చేస్తోందని విమర్శలు చేశారు. తెలంగాణలో కులగణన కాదు, సర్వే చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటు–న్నారని అన్నారు. ఈ రెండింటికి తేడా ఏంటని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రేపు బీజేపీ ప్రభుత్వం చేసేది కూడా ఇదే కదా.. కులగణన చేసేది ఈ అధికారులే కదా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. సర్వే, కుల గణన చేసినా కులం మారదు కదా అని ప్రశ్నించారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కులగణన ప్రారంభించి కట్ ఆఫ్ డేట్ పెట్టి పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని చెప్పారు. ఈ రోజు దేశవ్యాప్తంగా బీసీలు ఒక్కటవుతున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీ ధర్నాకు 17 రాజకీయ పార్టీలు హాజరైతే.. బీజేపీ, బీఆర్ఎస్‌లు దూరంగా ఉన్నాయని మండిపడ్డారు. బీసీల పట్ల ఈ రెండు పార్టీల చిత్తశుద్ధి ఏంటో తెలుస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కాశ్మీర్‌లో అభివృద్ధికి ఆటంకం లేకుండా చర్యలు

- సిఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి



**శ్రీనగర్,మే5( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో పరిపాలన, అభివృద్ధి పనులు ఆగకుండా చూడాలని కేంద్రం సూచించినట్లు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన కొనసాగాలని ప్రధాని మోదీ చెప్పినట్లు– ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌లో మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఒమర్ అబ్దుల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడితో రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ రాష్ట్రంలో సమర్థవంతమైన పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదని ఇటీవలి సమావేశంలో ప్రధాని మోదీ సూచించారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. పహల్గాం దాడి అనంతరం దేశం మొత్తం జమ్మూకశ్మీర్‌కు బాసటగా నిలుస్తోంది. ఇదే తరుణంలో త్వరలో జరగనున్న అమర్‌నాథ్ యాత్రను సజావుగా నిర్వహించేలా సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా.. పరిపాలన, ప్రజా కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదు. ఈ మేరకు ఎన్ని చర్యలైనా తీసుకోవాలి. ఎంత ఖర్చయినా భరించాలని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. ఉగ్రదాడి నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేయలేదు. కశ్మీర్‌లో ఏప్రిల్ 19న రైలును ప్రారంభించాల్సి ఉండగా.. ఉద్రిక్తతల కారణంగా వాయిదా వేశాం. త్వరలో రైలు, బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేసి తీరుతాం. రానున్న ఆరు నెలలు పరిపాలన, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేయాలి. పాలన కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకూడదని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# సింధూనది ప్రాజెక్టుల సామర్థ్యంపెంపు

- గుట్టుచప్పుడు కాకుండా వేగంగా పనులు



**న్యూఢిల్లీ,మే5( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఇప్పటికే ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. ఈ రెండు హైడ్రోపవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం వెలువరించింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. దీనికి సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు వెల్లడించలేదు. తొలిసారి ఆ ఒప్పందానికి భిన్నంగా భారత్ తీసుకొన్న తొలి చర్యగా నిపుణులు చెబుతున్నారు. గత గురువారం నుంచి ఒక రిజర్వాయర్‌లో బురదను తొలగించేందుకు ఫ్లషింగ్ పక్రియను మొదలుపెట్టింది. దాదాపు మూడు రోజులపాటు ఇది కొనసాగింది. ఈ పనులను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ చూసుకొంటోంది. కాకపోతే పాక్‌కు ఇప్పటికిప్పుడు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాకపోయినా.. భవిష్యత్తులో మాత్రం సమస్యలు ఎదురుకావచ్చని నిపుణులు చెబుతున్నారు. సింధు జలాల ఒప్పందం కిందకు వచ్చే నదులపై ఇలాంటివి దాదాపు అరడజను ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిల్లో నిల్వ సామర్థం పెంచితే మాత్రం పాక్‌కు నీటి కరవు తప్పదు. బురదను, నీటిని బయటకు పంపే ఫ్లషింగ్ పక్రియ కారణంగా విద్యుత్తును మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేసే అవకాశంతో పాటు–.. టర్బైన్ దెబ్బతినకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో.. పాక్‌కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం భారత్‌కు లేదు. మన ప్రాజెక్టుల్లో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోవచ్చని సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా పేర్కొన్నారు. ఇక ఈ ఒప్పందాన్ని భారత్ నిలిపివేస్తే.. ఎదుర్కొనేందుకు పాక్ వద్ద పరిమిత ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. ఈ ఒప్పందానికి మధ్యవర్తి అయిన ప్రపంచ బ్యాంక్ వద్దకు వెళ్లడం తప్ప మిగిలిన వాటివల్ల దానికి పెద్దగా ప్రయోజనం లేదు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో సిజేరియన్..కవలల మృతి

**రంగారెడ్డి,మే5( వెలుతురు):**
ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. ఆస్పత్రిలో గర్భవతికి సిజేరియన్ నిర్వహించగా.. కవల శిశువులు మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే కవలలు మృతి చెందారని బంధువులు ఆరోపిస్తున్నారు. వీడియో కాల్ ద్వారా నర్సులతో ఆపరేషన్ చేయించారని వాళ్లు మండిపడుతున్నారు. తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత ఏర్పడింది.

# ఉగ్రదాడిపై మనకేం సంబంధం

- భారత్ విమానాలను కూల్చేయాలన్న ఎంపి ఒమర్
- దాడికి దిగితే ధీటుగా జవాబిస్తామన్న ఆర్మీ చీఫ్



**ఇస్లామాబాద్,మే5( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడిపై పాక్ జాతీయ అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్ష నేత, పీటీఐ మద్దతుతో గెలిచిన ఎంపీ ఒమర్ అయూబ్ భారత్‌పై విషం కక్కారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం దాడిపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు న్యూఢిల్లీకి దాసోహం అన్నట్టుగా ఉన్నాయని ఆక్షేపణ తెలిపారు. దాడితో పాక్‌కు సంబంధం లేదన్నారు. భారత్‌పై దాడిచేసి వారి విమానాలు నేలకూల్చాలన్నారు. పహల్గామ్ మనకు ఎంతో దూరం..అక్కడకి వెళ్లి మనమెలా దాడి చేస్తామని అన్నారు. ఇదిలావుంటే ఈ నేపథ్యంలో పాక్ పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమ దేశంపై ప్రతీకార చర్యలకు పాల్పడితే.. దానికి దీటుగా బదులిస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. భారత్ నుంచి ఏదైనా దాడి జరిగిన వెంటనే తమ సైన్యం చురుగ్గా ప్రతిస్పందిస్తుందని మునీర్ వ్యాఖ్యానించారు. తాము ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉన్నప్పటికీ..జాతీయ ప్రయోజనాలను, దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి తమ సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే.. పహల్గాం దాడికి వారం రోజుల ముందు మునీర్ పాకిస్థాన్‌లో చేసిన కశ్మీర్‌పై చేసిన ప్రసంగమే కారణమై ఉండొొచ్చని భారత నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేశాయి. ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు. మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకుంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి జరిగినప్పుడు మునీర్ పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతిగా ఉన్నారు. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఇప్పుడు ఆయనే ఆర్మీ చీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

# ఉగ్రదాడి మృతుడి భార్యపై ట్రోల్

- ఘాటుగా స్పందించిన మహిళా కమిషన్



**న్యూఢిల్లీ,మే5( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఆ ట్రోలింగ్‌ను ఖండించింది. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో మృతి చెందినవారిలో నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు- చేయడం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ తరుణంలోనే మహిళా కమిషన్ నుంచి స్పందన వచ్చింది. పహల్గాం ఉగ్రదాడిలో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడింది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి, ప్రాణాలు తీశారు. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో ఆయన భార్య హిమాన్షి నర్వాల్ వ్యక్తంచేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, జాతీయ కమిషన్ ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. హరియాణాకు చెందిన వినయ్- హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది.

# మాక్ డ్రిల్‌లు నిర్వహించండి

- రాష్ట్రాలకు మోంశాఖ ఆదేశాలు




**న్యూఢిల్లీ,మే5( వెలుతురు):**
పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. శత్రు దాడి జరిగినప్పుడు సంసిద్ధంగా ఉండేందుకు మే 7 నుంచి పౌర రక్షణ మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని సూచించినట్లు- ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మాక్ డ్రిల్ ద్వారా వైమానిక దాడుల సైరన్‌లను పరీక్షించడం, పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, బ్లాక్‌అవుట్ చర్యలను అమలు చేయడం వంటి మొదలైన కీలక కార్యకలాపాలు నిర్వహిస్తారు. దాయాది దేశంతో ఉద్రిక్తలు పెరుగుతుండటంతో దేశంలో వైమానిక దాడులపై అవగాహన పెంచేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక అధికారులు, విద్యా సంస్థలు, పౌరులకు ఎమర్జెన్సీ వేళల్లో ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలని నొక్కి చెప్పింది. శత్రుదేశాలు దాడి చేస్తే ఎలా స్పందించాలి.. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు శిక్షణ ఇస్తారు. క్రాష్ బ్లాక్‌అవుట్ చర్యలు కూడా ఉంటాయి.

# అంబర్‌పేట, బిహెచ్ఇఎల్ ఫ్లై ఓవర్లకు మోక్షం

- ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులు పదినెల్లో పూర్తి
- భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సూచన
- ప్రారంభించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీ



**హైదరాబాద్,మే5( వెలుతురు):**
హైదరాబాద్‌లో అంబర్‌పేట ఫ్లై ఓవరు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట, బీహెచ్‌ఈఎల్ కూడలిలో నిర్మించిన పైవంతెనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం



చేశారు. అందరికీ నమస్కారం, బాగున్నారా..? అంటూ తెలుగులో మాట్లాడడం మొదలు పెట్టిన ఆయన అనేక అభివృద్ధి అంశాలపై స్పందించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సరిగా సాగడంలేదని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పనుల్లో తలెత్తిన సమస్యకు పరిష్కారం కనుగొన్నామని, వేగంగా పూర్తి చేయడంకోసం కొత్త కాంట్రాక్టర్‌ను నియమించామని తెలిపారు. వచ్చే పది నెలల్లో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ భూసేకరణ వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఐటీ-, ఫార్మా రంగాల్లో అగ్రస్థానంలో ఉందని.. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఇది కేంద్ర బిందువైందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. దేశంలోని అనేక నగరాల నుంచి ప్రజలు హైదరాబాద్‌ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రధాన నగరాలతో కలిపేలా జాతీయ రహదారుల అభివృద్ధి జరిగిందని వివరించారు. ఇండోర్-హైదరాబాద్ కారిడార్ తెలంగాణలో పూర్తయ్యిందని, మహారాష్ట్రలో కూడా పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కారిడార్‌తో 20 గంటల ప్రయాణం 10 గంటల్లో పూర్తి అవుతుందని చెప్పారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ 4 లేన్ రోడ్డు ని 6 లేన్ రోడ్డుగా మారుస్తామని చెప్పారు. నాగ్‌పూర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన డబుల్ డెక్కర్ ఎయిర్ బస్ ను హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ప్రయోగాత్మకంగా పరిశీలన చేయాలని రాష్ట్ర మంత్రులను కోరారు. ఈ బస్సులో ఎయిర్ హోస్టెస్ లాగా బస్ హోస్టెస్ కూడా ఉంటారని, సాధారణ బస్సుల కంటే 3 శాతం ఛార్జి తక్కువగా ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. డీజిల్, పెట్రోల్ వాహనాలపై ఆధారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశ అభివృద్ధి సాధ్యం కాదని, స్మార్ట్ గ్రామాలు అవసరం అని గడ్కరీ తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీతోపాటు ఫార్మా రంగం కూడా పెద్దదే. దేశంలోని ఎన్నో నగరాల నుంచి హైదరాబాద్‌కు వస్తుంటారు. అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్‌కు కనెక్ట్ చేసేలా జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ నేతృత్వంలో మేమంతా కట్టు-బడి ఉన్నాం. ఇండోర్-హైదరాబాద్ కారిడార్ తెలంగాణ పనులు పూర్తి చేశాం. మహారాష్ట్రలో కూడా పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ కారిడార్ పూర్తయితే 20 గంటల ప్రయాణం 10 గంటల్లోనే చేయొచ్చు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం. అంబర్‌పేట పైవంతెనను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్‌ఈఎల్ వంతెనను నిర్మించారు. నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు. అంబర్‌పేట ÷-లఫైఓవర్ ప్రారంభించుకున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి' అని అన్నారు. నో అనే మాట గడ్కరీ నోటి నుంచి రాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్, కొంపల్లి కారిడార్‌లు వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, కరీంనగర్ హైవేను జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. ఇదిలావుంటే అంబర్‌పేట పైవంతెన ప్రారంభోత్సవ సమయంలో ఉద్రిక్తత చోటు-చేసుకుంది. కాంగ్రెస్, భాజపా శ్రేణుల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. భాజపా నాయకులు మోదీ..మోదీ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు అందుకున్నారు. గడ్కరీ కాన్వాయ్‌ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలను పోలీసులు చెదరగొట్టారు.

# హరిరామ్ ఆర్థిక లావాదేవీలపై ఆరా

- లాకర్లు తెరిపించే చర్యలు మొదలు



**హైదరాబాద్,మే5( వెలుతురు):**
ఆదాయానికి మించి ఆస్తుల కేసులో కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఈఎన్సీ హరిరామ్ కస్టడీ కొనసాగుతోంది. ఐదురోజుల కస్టడీలో భాగంగా ఏసీబీ అధికారులు నాలుగో రోజు ఆయనను ప్రశ్నించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు వాటి కొనుగోళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. సోదాల్లో భాగంగా గుర్తించిన బ్యాంకు లాకర్లు తెరిపించేందుకు చర్యలు ప్రారంభించారు. ఈరోజు బ్యాంకు లాకర్లు తెరిచే అవకాశం ఉంది. వాటిని తెరిస్తే మరికొన్ని కీలక పత్రాలు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటు-ందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలోనూ ఏవైనా ఆస్తుల పత్రాలు లభిస్తే వాటి ఆధారంగా కూడా హరిరామ్‌ను మరింత లోతుగా ప్రశ్నించే అవకాశం ఉంది. హరిరామ్‌ను ఐదురోజుల పాటు- కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. ఈరోజు నాలుగోరోజు విచారణ కొనసాగుతోంది. అయితే గడిచిన మూడు రోజుల విచారణలో కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బంజారాహిల్స్ ఏసీబీ ప్రధాన కార్యాలయంలో హరిరామ్‌ను దాదాపు ఐదు మంది అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు వందల కోట్లు- ఆస్తులు కూడబెట్టినట్లు- ఇప్పటికే అధికారులు ఓ అంచనాకు వచ్చారు. ఇంకా బినామీ ఆస్తులకు సంబంధించి కూడా పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈరోజు సాయంత్రం లోగా బ్యాంకు లాకర్లను కూడా తెరిచే అవకాశం ఉంది. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బంగారం, ఇతరత్రా కీలకమైన డాక్యుమెంట్లు- దొరికితే వాటికి సంబంధించి కూడా పూర్తి స్థాయిలో విచారణ కొనసాగించే అవకాశం ఉంది. కొండాపూర్, మాధాపూర్, శివారు ప్రాంతాల్లో హరిరామ్‌కు సంబంధించిన విల్లాలు ఉన్నట్లు- గుర్తించి.. వాటి పత్రాలను సీజ్ చేశారు. మూడు రోజుల విచారణలో ఏసీబీ అధికారులకు హరిరామ్ సహకరించడం లేదని సమాచారం. దీంతో నేడు, రేపటి విచారణ చాలా కీలకమని చెప్పుకోవచ్చు. ఈ రెండు రోజుల విచారణ తర్వాత ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయి.. రిమాండ్‌కు తరలించే సమయంలో ఎలాంటి కీలక అంశాలు రాబట్టారు అనే విషయాలను రిమాండ్ రిపోర్టులో పేర్కొనే అవకాశం ఉంది. ఈరోజు మధ్యాహ్నం తరువాత హరిరామ్‌ను తీసుకెళ్లి బ్యాంకు లాకర్లు ఓపెన్ చేసి అక్కడే విచారణ జరిపే ఛాన్స్ ఉంది.

# అక్రమ చొరబాటు దారుడి పట్టివేత

**న్యూఢిల్లీ,మే5( వెలుతురు):**
భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఓ పాకిస్థానీ యువకుడిని బోర్డర్ సెక్యూరిటీ- ఫోర్స్ తాజాగా అరెస్టు చేసింది. మే 3 రాత్రి సమయంలో పాక్ యువకుడు హుస్నెయిన్ పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా మీదుగా భారత్‌లోకి చొరబడేందుకు యత్నించి భద్రతాదళాలకు దొరికిపోయాడు. నిందితుడు పాక్‌లోని గుజ్రన్‌వాలా జిల్లాకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. సరిహద్దు వెంబడి250 మీటర్ల మేర భారత్ భూభాగంలోకి వచ్చిన సమయంలో అతడిని భద్రతాదళాలు గుర్తించాయి. సందీప్ ఘోష్ ఆ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే కంపెనీ కమాండర్‌కు సమాచారం అందించారు. వెంటనే క్విక్ రెస్పాన్స్ టీం అక్కడకు చేరుకుని ఆ ప్రాంతం మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంది. రాత్రి 11.45 సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకుంది. అంతర్జాతీయ సరిహద్దు, బీఎస్ఎఫ్ సరిహద్దు కంచె మధ్య ఉన్న పొదల్లో దాక్కున్న అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద 40 పాకిస్థానీ రూపాయలతో పాటు-, పాక్ జాతీయ ఐడెంటిటీ- కార్డును కూడా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నాక బీఎస్ఎఫ్ సిబ్బంది పంజాబ్ పోలీసులకు అప్పగించారు. మే3న అదుపులోకి తీసుకున్నట్టు- రికార్డుల్లో నమోదు చేశారు. ఇంటె-లిజెన్స్ వర్గాలకు కూడా ఈ విషయమై సమాచారం అందించారు. ఘటన నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. సరిహద్దు వద్ద గస్తీ పెంచాయి.

# కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదు

- రేవంత్ దెబ్బకు గిలగిల కొట్టుకుంటున్న బిఆర్ఎస్ నేత
- పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అద్దంకి దయాకర్

**జనగామ,మే5( వెలుతురు):**
కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డిని తట్టుకోవడం అంత ఈజీ కాదని స్పష్టం చేశారు.జనగామ జిల్లా పాలకుర్తిలోని బృందావన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ తీరును తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా ఆ సభలో కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీష్ రావులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. అలాగే.. నువ్వు ఉద్యమ నాయకుడి అని చెప్పుకుంటావు. 9 సంవత్సరాలుగా సీఎంగా ఉన్నావు. ఒక్క సభ కోసం వందల కోట్లు ఖర్చు పెట్టావు. కానీ, రేవంత్ రెడ్డి ఒక్కరే నిన్ను రాజకీయంగా పూర్తిగా కుదిపేశాడు. ఆ దెబ్బకి నీవు ఇప్పటివరకు కోలుకోలేదని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, కేటీఆర్ ను బీఆర్ఎస్ పార్టీ జనతా గ్యారేజ్ అన్నావు.. కానీ, ఆ గ్యారేజ్‌లో తానే తన కొడుకును సంపేస్తున్నాడు అని విమర్శించారు. బీజేపీ పార్టీపై కూడా అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ ఒక బిల్లా రంగ పార్టీ. అందులో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి నేతలు బిల్లా రంగ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు కులగణనకు



వ్యతిరేకంగా మాట్లాడిన బీజేపీ నాయకులు, ఇప్పుడు మోడీ ప్రభుత్వం కులగణన చేస్తామంటే సంతోషంగా స్పందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, కాంగ్రెస్ పార్టీ లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమేనని దయాకర్ పేర్కొన్నారు. నాకు పార్టీ నుండి అవకాశం రాకపోయినా ఎప్పుడూ బాధపడలేదని, పార్టీ ఎప్పుడైనా నన్ను గుర్తిస్తుందని నమ్మకం ఉందని ఆయన అన్నారు. పార్టీ నన్ను గుర్తించి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ వాడుకునే వదిలేసే పార్టీ కాదు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇచ్చే పార్టీ అదే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటే

- ఒకే కంపెనీ డైరెక్టర్లు వారు
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



**నిజామాబాద్,మే5( వెలుతురు):**
కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలు ఒకే కంపెనీకి చెందిన డైరెక్టర్లలాంటి వారని విమర్శలు చేశారు. సోమవారం జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో పసుపు పరిశ్రమను ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ముందుకు వస్తే సబ్సిడీలు ఇస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. దేశంలోనే నిజామాబాద్ ప్రాంతంలో ప్రగతిశీల రైతులు ఉన్నారని అన్నారు. ప్రతి పంటపై అవగాహన కలిగి ఉన్నారని చెప్పారు. కో ఆపరేటివ్ సెక్టార్‌లో ఏర్పడే పరిశ్రమలకు ఇందూరు ప్రాంతం ఎంతో అనుకూలమని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు లక్ష కోట్ల నిధులు మంజూరు చేస్తామని అన్నారు. తెలంగాణలో ఉన్న పాకిస్తానీయులను వెంటనే పంపించి వేయాలని ప్రభుత్వాన్ని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. బోధన్ రోహింగ్యాలకు అడ్డాగా మారిందని ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనదేశానికి జగద్గురువు అని అభివర్ణించారు. వచ్చే 2029 ఎన్నికల్లో ఇందూరు సెగ్మెంట్‌లో బీజేపీకి 70 శాతం ఓట్లు- వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఏనాడైనా ముస్లింలు బీజేపీకి ఓట్లు- వేస్తారా అని ప్రశ్నించారు. హిందూ ప్రాణాలకు లెక్కేలేదని చెప్పారు. తెలంగాణలో పాకిస్తానీయులు ఒక్కరూ కూడా ఉండవద్దని అన్నారు. హిందూ రాష్ట్ర స్థాపనకు ఇందూరు నుంచే పునాది పడుతోందని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

# ఆర్టీసీ కార్మికులక సమ్మె కవాతు

- సమ్మె యధాతథంగా కొనసాగుతుందని వెల్లడి




**హైదరాబాద్,మే5( వెలుతురు):**
ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో సోమవారం వారు కవాతు నిర్వహించారు. అందులోభాగంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్దనున్న బస్ భవన్‌ను తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సోమవారం ముట్టడించారు. దీంతో బస్ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మరోవైపు సమ్మె యధా విధిగా కొనసాగుతోందని ఆర్టీసీ జేఏసీ ఈ సందర్భంగా ప్రకటించింది. సమ్మె నేపథ్యంలో తమతో చర్చలకు ఆర్టీసీ యాజమాన్యం పిలవకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్థరాత్రి నుంచి బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోతాయని చెప్పారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. మే 7వ తేదీ నుంచి తాము తలపెట్టిన సమ్మె యధా విధిగా కొనసాగుతుందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. కార్మికుల కవాతు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆదివారం ఆర్టీసీ కార్మిక నేతలతో సమావేశమయ్యారు. సమ్మెను ఉప సంహరించుకోవాలని వారికి ఆయన సూచించారు. ఆర్టీసీ సంస్థ ఇప్పుడే లాభాల బాట పడుతోందని వారికి వివరించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరిన అనంతరం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన వివరాలను వారికి ఆయన సోదాహరణగా వివరించారు. అయితే ఆర్టీసీ జేఏసీ నేతలు మాత్రం తమ సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోమని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆర్టీసీ కార్మికులు సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ముఖ్య కార్యాలయం బస్ భవన్‌ను వారు ముట్టడించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. మే 7వ తేదీ నుంచి తాము సమ్మెకు వెళ్తున్నట్లు- తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా ఏప్రిల్ 27వ తేదీన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ జేఏసీ విడుదల చేసింది. మేడే స్ఫూర్తితో తాము ఈ సమ్మెకు సిద్ధమయ్యామంది. ఇప్పటి-కై-నా ప్రభుత్వం స్పందించి.. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి ఆర్టీసీ జేఏసీ తీసుకు వెళ్లింది.

# ఎండబెట్టిన మొక్కజొన్న అగ్నికి ఆహుతి

- లబోదిబోమంటున్న అన్నదాతలు

**వరంగల్,మే5( వెలుతురు):**
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మొగిలిచర్లలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎండబెట్టిన మక్క పంట అగ్నికి ఆహుతయ్యింది. గీసుకొండ నుంచి మొగిలిచెర్లకు వెళ్లే రహదారిపై విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ఉన్న సుమారు 30 ఎకరాల మొక్కజొన్న చేను ఉంది. ఇటీవల రైతులు చేలల్లోని మొక్కజొన్న కంకులను ప్రధాన రహదారిపై ఎండలో ఆరబెట్టారు. రహదారిపై రైతులు 30 ఎకరాలకు సంబంధించిన మొక్కజొన్న కంకులను ఎండలో ఆరబెట్టారు. రాత్రి ఓ రైతు చేనులో మొక్కజొన్న చొప్పను కాల్చేందుకు నిప్పుపెట్టగా.. ప్రమాదవశాత్తు అది దావానలంలా వ్యాపించింది. కొన్ని క్షణాల్లోనే పక్కనే ఉన్న చేలకు మంటలు అంటు-కుని తీవ్రరూపం దాల్చాయి. భారీగా ఎగిసిపడిన అగ్నికీలలను ఆర్పేందుకు స్థానికులు యత్నించినా.. మంటలు అదుపులోకి రాలేదు. దీంతో వరంగల్ నుంచి రెండు ఫైరింజిన్లను రప్పించి మంటలను అదుపు చేశారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



# రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

- భూసారాన్ని పెంచితేనే మనుగడ
- ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి
- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో తుమ్మల

**వికారాబాద్,మే5( వెలుతురు):**
వ్యవసాయంలో మరిన్ని మార్పులు రావాలని,రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికా ఉత్పత్తి పేరుతో భూసారం దెబ్బతీస్తున్నారని అన్నారు. దీనిపై రైతులు ఆలోచన చేయాలని అన్నారు. భూసారం దెబ్బతింటే ఏ మందూ పనిచేయదని అన్నారు. రైతు వేదికలో..'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని మంత్రితుమ్మల సోమవారం తుమ్మల ప్రారంభించారు. సభాపతి ప్రసాద్ కుమార్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డిలతో పాటు- ధరూర్ క్లస్టర్ పరిధిలోని రైతులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ సన్నద్ధంలో భాగంగా శాస్త్రవేత్తలు రైతులను సమాయత్తం చేశారు. వరి సాగులోనూ పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలని తుమ్మల అన్నారు. యూరియా అధికంగా వాడి, మనల్ని పోషించే భూతల్లిని నాశనం చేయొద్దని సూచించారు.

గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్ళీ పునరుద్ధరించనుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దీని సాగు పెరగాలి. ఇప్పుడు అన్ని జిల్లాల్లో ఈ పంట సాగుకు అనుమతి ఉంది. ఆయిల్‌పామ్‌లో మూడేళ్ల పాటు- అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. గతంలో ఈ పంట దిగుబడి ఆరేళ్లకు వచ్చేది.. ఇప్పుడు మూడేళ్లకే వస్తోంది. దీని సాగుతో నెలకు రెండుసార్లు జీతం వచ్చినట్లు- రైతులకు ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్లీ పునరుద్ధరించనుంది. ఖజానా ఖాళీగా ఉండటం వల్ల కొన్ని ఆలస్యం అవుతున్నాయని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# నీట్ పరీక్ష రాసి...ర్యాంక్ రాదేమోనన్న భయం

- ఇంటికి వచ్చి ఉరేసుకుని యువతి ఆత్మహత్య

**జగిత్యాల,మే5( వెలుతురు):**
జిల్లాలోని చల్‌గల్ గ్రామానికి చెందిన జంగాపూజ(18) అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. నీట్ పరీక్ష రాసిన ఆమె.. పేపర్ ను క్రాస్ చెక్ చేసుకున్న తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండేళ్ల క్రితం రాసిన నీట్ పరీక్షలో ర్యాంకు రాకపోవడంతో రెండోసారి తాజాగా నీట్ పరీక్ష రాసింది. అయితే ఇంటికి వచ్చిన తర్వాత పేపర్ ను క్రాస్ చెక్ చేసుకుని ర్యాంకు రాదనే ఆందోళనలో పడింది. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లాలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నాచుపల్లి జేఎన్టీయూ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నట్లు- తెలిపారు. జిల్లాలోని ఒక సెంటర్‌లో 480, రెండో సెంటర్లో 278 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఒక కేంద్రంలో 13 మంది, మరో కేంద్రంలో ఐదుగురు గైర్హాజరైనట్లు- వివరించారు. ఇకపోతే జేఎన్టీయూ పరీక్ష కేంద్రం తెలియక మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న ఓ విద్యార్థిని పరీక్ష దూరమైంది. మల్లాపూర్ మండలం వీవీ.రావుపేటకు చెందిన సీహెచ్.నవ్యకు జేఎన్టీయూ కేంద్రం పడింది. దీంతో ఆమె కుటు-ంబ సభ్యులతో కలిసి బయల్దేరింది. ఇంజినీరింగ్ కళాశాల అడ్రస్‌పై అవగాహన లేక దిగువ కొండగట్టు- వరకు వెళ్లారు. పూర్తి అడ్రస్ తెలుసుకుని వెళ్లే సరికి మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అక్కడున్న సిబ్బంది లోపలికి అనుమతించలేదు. గతంలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నా.. ఆశించిన ఫలితం రాలేదని, మరోసారి పరీక్షకు సన్నద్ధమైన రాయలేకపోయాయని ఆవేదనతో తిరిగి వెళ్లిపోయింది.

# రైతులను ఆదుకునేలా చర్యలు

- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు
- మంత్రి పార్థసారథి వెల్లడి



**అమరావతి,మే5( వెలుతురు):**
రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల్లో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని జిల్లాల కలెక్టర్‌లను అకాల వర్షాలపై రిపోర్ట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు. రంగు మారినా కూడా ధాన్యాన్ని కొనాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటు-ందన్నారు. విపత్తుల నిర్వహణ వర్షాలు.. పిడుగులకు సంబంధించి ఎప్పటికప్పుడు అలెర్ట్ చేస్తోందన్నారు. ఇంకా మెరుగ్గా విపత్తుల నిర్వహణ శాఖ వాతావరణం వివరాలు ఇవ్వాలని సీఎం సూచించారన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు ధాన్యం తడవడంతో , పంటనష్టం జరుగుతుందన్నారు. మంగళవారం నాటికి పూర్తి సమాచారం ఇవ్వమని సీఎం ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రాణ, ఆస్తి నష్టానికి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, వడగాలులు, ఉరుముల, పిడుగుపాట్లు వంటి 30 సేవలు విపత్తు నివారణ శాఖ అందించాలని సీఎం సూచించినట్లు- తెలిపారు. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్‌లకు ఒక కామన్ టెస్ట్ పెట్టి పరిశ్రమల్లో ఉద్యోగాలు వచ్చేలా ఏర్పాటు- చేయాలని నిర్ణయించినట్లు- తెలిపారు. ప్రభుత్వం అవసరం అయితే ఒక ఏజెన్సీ సహాయంతో పరీక్ష నిర్వహణపై దృష్టి పెడుతుందని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి కోసం పనిచేయడం, ముఖ్యమంత్రి మెప్పుకోసం పని చేయడం జరిగేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంతృప్తి, సేవలు మెరుగుగా అందించటం ద్వారా ప్రజల సంతృప్తి అనే అంశంపై పనిచేస్తోందని వెల్లడించారు. వేలమంది లబ్దిదారుల అభిప్రాయం తీసుకున్నామని.. ప్రజల్లో సంతృప్తి పెరుగుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసాపై ఎక్కువ పర్సెంటేజే పెరిగిందన్నారు. రెవిన్యూ, హౌసింగ్‌పై సీఎం రివ్యూ చేశారని... ఈ శాఖలపై కూడా ప్రజల సంతృప్తి శాతం పెరిగిందని చెప్పుకొచ్చారుర. వాట్సప్ గవర్నెన్స్‌పై ఏడు లక్షల అప్లికేషన్‌లు వచ్చాయన్నారు. ఐదు లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు వినూత్న కార్యక్రమం ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. రాబోయే పరిశ్రమలకు స్కిల్ ఉన్నవారిని గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జాబ్ డేటా యాప్ తయారుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. స్కిల్ టెస్ట్ కోసం ప్లాట్ ఫాం ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, కసిరెడ్డి వ్యవహారానికి సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఎంపీ కేసినేని చిన్నికి , కసిరెడ్డి రాజ్‌కు వ్యాపార సంబంధాలు ఉంటే అవి ఇప్పటివి కాదేమో అని అభిప్రాయడ్డారు. వారి వ్యాపార సంబంధాలపై తనకు నాలెడ్జ్ లేదన్నారు. కేశినేని నాని, తను సోదరుడు ఎంపీ కేశినేని చిన్నిపై చేసిన ఆరోపణలు వాస్తవమైతే సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

# ఉద్యోగ సంఘాలతో చర్చలేవీ

- కమిటీ నియిమించినా చర్చలకు పిలవని మంత్రులు
- సిఎం వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్య

**హైదరాబాద్,మే5( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సబ్ కమిటీ ఏర్పాటైనప్పటికీ, ఏడు నెలలు గడిచినా ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలకు ఎన్నో సమస్యలు ఉన్నాయి., సీఎం రేవంత్ రెడ్డి చర్చకు రావాలని పిలిచారు.. కానీ మంత్రులు మాత్రం చర్చకు సమయం కేటాయించడం లేదని అన్నారు. గత ప్రభుత్వం విజ్ఞప్తులకు స్పందించకపోవడం వాస్తవమే. ఆర్థిక సమస్యలు పక్కన పెట్టినప్పటికీ, విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మేము సమరం కాదు, ఉద్యమం చేస్తున్నాం. మంత్రుల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. అడగొద్దు అంటే అడగం. మేమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చాం అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అంటే గౌరవం. మీరు తండ్రి పాత్రలో ఉన్నారు. మీరు ఇచ్చిన గంట సమయం మాకు విలువైనది. కానీ, మిగిలిన మంత్రులు మాత్రం మాట్లాడటం లేదు. ప్రజలపై యుద్ధం చేయాలని మేము కోరడం లేదు. సబ్ కమిటీ- అనే మీ ఏర్పాటు- చేసిన బృందం అసలు మాట్లాడటానికి ముందుకు రావడంలేదు. సీఎం చెప్పినట్లే, కొంతమంది సంఘాల నేతలు ప్రభుత్వంతో కుమ్మక్కు అయ్యారు. వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చూడండి. ప్రభుత్వానికి డబ్బుల్లేవన్న విషయాన్ని మేము అర్థం చేసుకోగలం. కానీ, మాతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయండి. కోట్ల రూపాయలు అడగడం లేదని ఆయన అన్నారు. మొత్తంగా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై తమ అంచనాలను స్పష్టంగా తెలియజేస్తూ సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# 15న పోచంపల్లి సందర్శించనున్న మిస్ పోటీదారులు

- భారీగా ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ



**హైదరాబాద్,మే5( వెలుతురు):**
హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ - 2025 గ్రూప్ -2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నట్లు పర్యాటక విభాగం అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్ పై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టైఅండ్-డై పక్రియను పరిశీలిస్తారు. నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. అలాగే హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చారిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక-సాంస్కృతిక వారసత్వం అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది. మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ రాష్ట్ర గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ ఇంకా సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల శక్తివంతమైన వేడుకగా మారుతుంది. ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉండనుంది. దీనితో చేనేత వారసత్వాన్ని, మగ్గం తెలంగాణ కథను ప్రపంచానికి తెలియజేస్తుంది.

# కర్ణుడి చావుకు వంద కారణాలు

- మా ఓటమికీ అలాంటి కారణాలే
- మాజీమంత్రి బొత్స సంచలన వ్యాఖ్యలు

**అనకాపల్లి,మే5( వెలుతురు):**
2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణుడు చావుకి వందకారణాలు అన్నట్టు-.. వైసీపీ పార్టీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసింది ఏమీ లేదని, లక్ష 50 వేల కోట్ల రూపాయలు అప్పు తప్ప అని విమర్శించారు. ప్రధాని మోడీ అమరావతికి ఎందుకు వచ్చారు, అమరావతిలో ఇప్పటివరకు ఏమి చేశారు, ఏమి చేస్తారో ముఖ్యమంత్రి చెంద్రబాబు సమాధానం చెప్పాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నేడు అనకాపల్లిలో జిల్లా వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. కర్ణుడు చావుకి వంద కారణాలు అన్నట్టు-, వైసీపీ పార్టీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసింది ఏమీ లేదు, లక్ష 50 వేల కోట్ల రూపాయలు అప్పు తప్ప. ప్రధాని మోడీ అమరావతికి ఎందుకు వచ్చారు, అమరావతిలో ఇప్పటివరకు ఏమి చేశారు, ఏమి చేస్తారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ప్రధాని శంకుస్థాపన చేసిన వైజాగ్ రైల్వే జోన్ ఏది, రైల్వే జోన్ పనులు ఏమైనా అసలు ప్రారంభించారా?. వైజాగ్‌లో ఏకరా భూమి 99 పైసలకు ధారపోశారు. సింహాచలంలో ఏడుగురు మరణానికి ఎవరు కారణం, అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే' అని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని వైఎస్ జగన్ రెండు కళ్లుగా చూశారు. సీఎం చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేశారు. కూటమి 11 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదు. రాష్ట్రానికి ఏం మేలు జరిగిందో ప్రజలు గమనించాలి. మూడు టీ-వీ ఛానళ్లు, మూడు పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారు' అని బొత్స సత్యనారాయణ విమర్శించారు. అనకాపల్లిలో జిల్లా వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో గుడివాడ్ అమర్ నాథ్, బూడి ముత్యాల నాయుడు, కన్నబాబు, వరుదు కల్యాణి, శోభ హైమావతి తదితరులు హాజరయ్యారు.

# గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కే టోకరా

- కన్సల్టెన్సీపై కేసునమోదు చేసిన పోలీసులు




**వేములవాడ,మే5( వెలుతురు):**

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్ గా మారింది. గల్ఫ్ లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు.

# కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

- ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య

**సంగారెడ్డి,మే5( వెలుతురు):**

క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కోలుకుంటున్న శ్రీతేజ్

- పరామర్శించిన నిర్మాత అల్లు అరవింద్



**హైదరాబాద్,మే5( వెలుతురు):**

పుష్ప -2 రిలీజ్ రోజున సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ను అ÷-ల్లు అరవింద్ పరామర్శించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం శ్రీతేజ్ కొద్దీ రోజుల క్రితం ఆసుపత్రి నుండి డిశార్చి అయ్యాడు. అయితే శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేందుకు మరి కొన్ని నెలలు పడుతుందని డాక్టర్లు వెల్లడించారు. అదే సమయంలో శ్రీతేజ్ ను రీహాబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. ఈక్రమంలో సోమవారం శ్రీతేజ్ ను అల్లు అరవింద్ పరామర్శించారు. పునరావస కేంద్రానికి వెళ్లి డాక్టర్లను కలిసి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'శ్రీ తేజ్ కోలుకోవటం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది. శ్రీతేజ్ రోజురోజుకు కోలుకుంటున్న విషయం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. శ్రీ తేజ్ చికిత్సకు సహకరిస్తున్నారు అని చెప్పారు డాక్టర్లు. ఇప్పటికే రూ. 2 కోట్లు- శ్రీతేజ్ అకౌంట్ లో డిపాజిట్ చేసాడు అల్లు అర్జున్. త్వరలోనే శ్రీ తేజ్ మనందరి మధ్య సాధారణల పిల్లల్లా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.

# వర్రా అరెస్ట్‌పై తప్పుడు అఫిడవిట్లు

- పోలీసులకు హైకోర్టు అక్షింతలు

**విజయవాడ,మే5( వెలుతురు):**



పోలీస్ అధికారులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్‌రెడ్డి కేసులో అరెస్ట్ సమయం, తేదీపై తప్పుడు అఫిడవిట్లు ఇచ్చారని ఫైరయ్యింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు వేసిన అఫిడవిట్లలో సమాచారం తప్పని హైకోర్టు తేల్చింది. 2024 నవంబర్ 8న అరెస్ట్ చేసి 10న చేశామని ఎలా చెప్తారని ప్రశ్నించింది. తాము తీసుకోబోయే చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని హైకోర్టు సూచించింది. సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో వైఎస్సార్ జిల్లాకు చెందిన వర్రా రవీంద్రారెడ్డిపై అక్రమ కేసులు బనాయించింది. పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్‌లో పుల్లప్పగారి హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద్రారెడ్డితో పాటు- అతడికి ఆశ్రయం కల్పించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లెకు చెందిన గుర్రంపాటి సుబ్బారెడ్డి అలియాస్ సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లెకు చెందిన గురజాల ఉదయ్‌కుమార్‌రెడ్డిలు కూడా కారులో ఉండటాన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే,ఈ అక్రమ కేసులపై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు ఈ ఏడాది మార్చి నెలలో వర్రా రవీంద్రారెడ్డికి పలు కేసుల్లో బెయిల్ మంజూరు చేసింది.

# ఐపిఎస్ అధికారి పిఎస్సార్ అరెస్ట్ పెద్ద తప్పిదం

- అధికారులను ఇలా కేసుల్లో ఇరికించడం సరికాదు
- జగన్ తప్పుచేస్తేజగన్‌నేజైలులో పెట్టాలి
- ముంబై నటి జెత్వానీ కేసు అక్కడే తేల్చాలి
- మీడియాతో మాజీ ఎంపి ఉండవల్ల అరుణ్ కుమార్

**రాజమండ్రి,మే5( వెలుతురు):**



సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై సీనియర్ రాజకీయ నేత, రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయులు అరెస్టు చాలా పెద్ద తప్పు అని అభిప్రాయపడ్డారు.. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం విజయవాడ జైలుకు వెళ్లి పీఎస్ఆర్ ను కలిసి వచ్చానని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పీఎస్ఆర్ పై కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ముంబై నటి తనను రేప్ చేశారని ఫిర్యాదు ఇచ్చిందని , ముంబైలో ఆ కేసు పరిష్కారం కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో విచారణ ఎలా ప్రారంభిస్తారు? అని ప్రశ్నించారు. పీఎస్ఆర్ అరెస్ట్ పోలీస్ శాఖపై చాలా ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించారు. తాను మరి కొంతకాలం జైల్లో ఉండడానికి సిద్ధంగా ఉన్నానని పీఎస్ఆర్ నాతో చెప్పారని అన్నారు. ఈ కేసు కు సంబంధించి ముంబైలో పూర్తి సమాచారాన్ని సేకరించి త్వరలో మరోసారి మీడియా ముందుకు వస్తానని ఉండవల్లి అరుణ్ కుమార్ వెల్లడించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వగానే కక్ష సాధింపు చర్యలు వద్దని గతంలోనే చెప్పానని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. జగన్ తప్పు చేస్తే జగన్‌ని జైలులో పెట్టాలని చెప్పారు. పోలీసులను జైల్లో పెట్టవద్దని అన్నారు. చాలా మంది ఐపీఎస్, ఐఏఎస్‌లు తనకు స్నేహితులుగా ఉన్నారని తెలిపారు. అందులో పీఎస్ఆర్ ఆంజనేయులు ఒకరని.. ఆంజనేయులు జైలుకి వెళ్లినప్పుడు చూడటానికి వెళ్లానని అన్నారు. డీజీ స్థాయి అధికారిని జైల్లో పెట్టడం ఇదే తొలిసారని ఉండవల్లి అరుణ్ కుమార్ తెలిపారు. పునర్వ్యభజన చెల్లదని సుప్రీంకోర్టులో పిటీషన్ వేశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గుర్తుచేశారు. పిటీషన్‌లో మార్పు చేసి ఏపీ పునర్వ్యభజన తప్పు అని నిర్ధారించాలని మళ్లీ సుప్రీంకోర్టులో పిటీషన్ వేశానని తెలిపారు. 2014 ఫిబ్రవరి 18వ తేదీన పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండానే ఏపీ విభజన చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయలేదని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఒక సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు-చేసి సుప్రీంకోర్టులో కేసు పాలో అప్ చేయాలని కోరారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కేసుకు ఒక ఆశాజ్యోతి అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. పునర్వ్యభజనలో ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి నేటికి 11 ఏళ్లు పూర్తయిందని వెల్లడించారు. పవన్ కల్యాణ్‌కు ఇప్పటికే ఈ విషయంపై లేఖ రాశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ అఫిడవిట్ ఫైల్ చేయలేదన్నారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ ఫైల్ చేసింది.. 43 సార్లు పార్టీ ఇన్ పర్సన్ గా కోర్టుకు హాజరయ్యాను.. ఆంధ్ర నుంచి ఈ విషయం ఎవరూ మాట్లాడరు అని ఆవేదన వ్యక్తం చేశారు.. విభజన చట్టంలో ఆంధ్రా కు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఒక ఆర్డర్ ఇవ్వండని కోర్టును కోరాము...పబ్లిక్ మీటింగ్‌లో మాత్రం ఆంధ్రాకు అన్యాయం జరిగిందని మాట్లాడుతున్నారు.. కానీ ఎక్కడ మాట్లాడాలో అక్కడ ప్రజాప్రతినిధులు మాట్లాడటం లేదని దుయ్యబట్టారు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీనియర్ అడ్వకేట్ ను తీసుకువచ్చి వాదన వినిపించమని చెప్పాలని సూచించారు.. ప్రజాస్వామ్యానికి అతి ప్రధానమైన ఆర్టికల్ 100 లోకసభలో ఏపీ రిఆర్గనైజేషన్ చట్టం చేసే సమయంలో సక్రమంగా అమలు కాలేదన్నారు.. గతంలో పవన్ కల్యాణ్ ఈ కేసుకు సంబంధించి అనుకూలంగా స్పందించారని గుర్తుచేసుకున్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్..ఉగ్రవాదం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అందరూ సమర్థించాలని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. భారతదేశంతో యుద్ధం చేసే శక్తి పాకిస్తాన్‌కు లేదని చెప్పారు. యుద్ధం జరిగితే పాకిస్తాన్ నష్టపోతుందని అన్నారు. మతం ప్రధానమనేది భారతదేశంలో సరికాదన్నారు. ఇండియాలో 12 శాతం ముస్లింలు ఉన్నారని తెలిపారు. పాకిస్తాన్‌లో హిందువులు ఒక్క శాతం మాత్రమే ఉన్నారని చెప్పారు. ముస్లింలపై వ్యతిరేకత సృష్టించకూడదని.. కానీ పాకిస్తాన్‌ను వ్యతిరేకించాలని అన్నారు. ప్రస్తుత తరుణంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టకూడదని చెప్పారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రపంచ దేశాలన్నీ ఖండిస్తున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి నాదెళ్ల

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీగా నష్టం
- అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

**విజయవాడ,మే5( వెలుతురు):**




అకాల వర్షాలకు కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. సోమవారం ఆయన పెద్దాపురం మండలం జే తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వరి కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అకాల వర్షాల గురించి, కల్లాలలో తడిసిపోయిన ధాన్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ , కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం నాయక్, వ్యవసాయ శాఖ జే డి ఎన్ విజయ్ కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే అకాల వర్షాలు ఏపీలోని పలు ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశాయి.. ఈదురుగాలులతో మొదలైన వర్షం.. గంటన్నరపాటు బీభత్సం సృష్టించింది..ఆదివారం కురిసిన అకాల వర్షం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పంటలకు పట్టిన పూట పగిలినట్టయ్యింది. చేతికి వచ్చే పరిస్థితిలో ఉన్న పంటలు ఒక్కసారిగా వానకు గురై రైతుల కలలను కరిగింపజేశాయి. మొక్కజొన్న, మామిడి, వరి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. పంటలను ఎండబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. కల్లంలో కాట వేసిన ధాన్యాన్ని అధికారులు ఇప్పటివరకు తీసుకోకపోవడంతో, ఆ ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటికే నష్టపోయిన రైతులకు ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని మరోచోటికి తరలించే ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, కూలీల వ్యయాలు కూడా భారంగా మారాయి. ఇప్పటి వరకూ ఒక్క అధికారి కూడా వచ్చి మా పరిస్థితి చూడలేదు.. మా దయనీయం ఆయన పరిస్థితిని చూసి ప్రభుత్వం మమల్ని ఆదుకోవాలి అని రైతులు వేడుకుంటున్నారు..వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని స్థానిక నేతలు అంటున్నారు. కళ్లాల్లో, పొలాల్లో రైతులవద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించడంలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు అకాల వర్షాలవల్ల మరింతగా నష్టపోతున్నారు. యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి. రైతులకు బాసటగా నిలవాలి. రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల సూచించారు.

# పంట దెబ్బతిన్న రైతులను తక్షణం ఆదుకోవాలి

- తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి
- పిడుగుపాటు మృతులకు 25 లక్షల పరిహారం చెల్లించాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సిపిఎం కార్యదర్శి

**విజయవాడ,మే5( వెలుతురు):**

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పంటనష్టం జరిగిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మామిడి రైతుల్ని ఆదుకోవాలని, ఈదురుగాలులతో కూలిపోయిన పేదల గుడిశలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, పిడుగుపాటుకు మరియు చెట్టుకూలి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి సరైన పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి సందర్భాలలో రైతులకు ఉపయోగపడేలా పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించి అమలు చేయాలని కోరింది.??నిన్న కురిసిన భారీ వర్షానికి రాష్ట్రవ్యాపితంగా అన్ని జిల్లాల్లో ధాన్యం, ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయని తెలిపింది. గోదావరి జిల్లాల్లో 50 వేల ఎకరాలు ధాన్యం నీటమునిగిందని, గుంటూరు జిల్లాలో వేలాది ఎకరాలు ధాన్యంతో పాటు-, మొక్కజొన్న, అరటి పసుపు పంట దెబ్బతిన్నట్లు- ప్రభుత్వమే ప్రాథమిక అంచనా వేసిందని పేర్కొంది. ఎన్‌టిఆర్, ఏలూరు, కడప, అన్నమయ్య జిల్లాలు చేతికొచ్చిన మామిడి పంట భారీ వర్షం, గాలులకు నేలకూలినట్లు- ప్రభుత్వ అధికారులే చెబుతున్నారని తెలిపింది. ఇది ప్రకృతి సృష్టించిన నష్టం అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం కూడా ఉందని పేర్కొంది. చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు ఆందోళన చేసినా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించింది. (ఉదా: కాకినాడ జిల్లాల్లో 6 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ కొనుగోలు చేసింది



కేవలం 4.40 లక్షల టన్నులు మాత్రమే. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి.) కాబట్టి ప్రభుత్వం తక్షణమే నష్టాన్ని అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.1 లక్ష, ఆహారపంటకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. చనిపోయిన కుటు-ంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఈదురుగాలులతో కూలిపోయిన గుడిశలకు రూ.50వేలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

# కాకాణి మైనింగ్ దోపిడీ అందరికీ తెలుసు

- అక్రమాలు చేయకుంటే ఎందుకు పరారయ్యారు
- ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర విమర్శలు

**నెల్లూరు,మే5( వెలుతురు):**

వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్ దోపిడీలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాత్ర గురించి అందరికీ తెలుసు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర విమర్శించారు. అక్రమాలు చేయనప్పుడు ఎందుకు పరారయ్యారని, బయటకు వచ్చి తాను నిజాయితీ పరుడునని చెప్పుకోవచ్చు కదా? అని అన్నారు. కేసులకు భయపడే కాకాణి పరారయ్యారని ఎద్దేవా చేశారు. అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా త్వరలో అరెస్ట్ కాబోతున్నాడని ఎమ్మెల్సీ బీదా తెలిపారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ ఇప్పటి వరకూ ఎక్కడ ఉన్నారో తెలియదు. ఇప్పుడు బయటకు వచ్చి మాజీ మంత్రి కాకాణి పైన కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని మాట్లాడుతున్నారు. వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్ దోపిడీ అందులో కాకాణి పాత్ర గురించి అందరికీ తెలుసు. అక్రమ మైనింగ్ వ్యతిరేకంగా సోమిరెడ్డి నిరసన దీక్ష చేపడితే ఆయనపై హిజ్రాలతో దాడి చేసిన ప్రయత్నాలు అందరికీ తెలుసు. వీడియో సాక్ష్యాలు కూడా ఉన్నాయి. రుస్తుం మైన్స్ లో కాకాణి అక్రమ తవ్వకాలు చేయించారు. అక్రమాలు చేయనప్పుడు ఎందుకు పరారయ్యారు. బయటకు వచ్చి తాను నిజాయితీపరుడునని చెప్పుకోవచ్చు కదా. కేసులకు భయపడే కాకాణి పరారయ్యారు' అని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర అన్నారు. ఎంపీ వేమిరెడ్డి రాజకీయాల్లోకి రాకముందు నుంచే ఆయనకు అధికారికంగా మైన్స్ ఉన్నాయి. గూడూరు సైదాపురం ప్రాంతాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కూడా అక్రమ మైనింగ్ జరిగింది. అక్రమ మైనింగ్ కేసులో తొందరలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా అరెస్ట్ కాబోతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుంటు-ండటంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ ఇప్పుడు బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై మీద విమర్శలు చేస్తున్నారు' అని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర ఫైర్ అయ్యారు.

https://epaper.velthuru.com
మంగళవారం 6 మే 2025
వెలుతురు


cinema

# బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు

పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్థం అవుతుంది. అయితే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించనున్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు. మరి ఈ మూవీలో ఎవరు రాబోతున్నారు చూడాలి.



# ఊరమాస్ లుక్‌లో సుహాస్

నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడవాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ-షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ- సునామీ రైడర్స్ అని రాసి ఉంది. ఇదేదో కబడ్డి ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు- ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చీనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్ తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకున్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.




# హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్

'హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు- ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ (కథ ఆగశసూశ) కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.



# రామయణ మూవీపె సిఎం ఫడ్ణవీస్ ప్రశంసలు

బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రామాయణ' సినిమాపై మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశంసలు కురిపించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత గొప్పది గా నిలిచే చిత్రమని కొనియాడారు. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి ఓ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. బీటౌన్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను వేవ్స్ సమ్మిట్‌లో ప్రదర్శించారు. ఈ సినిమా గురించి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడనవీస్ మాట్లాడుతూ.. 'భారత్‌లో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. మన కళ, నాటక రంగం, సంగీతం చాలా పురాతనమైనవి. వీటికి తాజాగా కొత్త టెక్నాలజీని జోడించాలని అనుకుంటున్నాం. రామాయణ విషయంలో ఇదే జరుగుతోంది. నేను ప్రధానితో కలిసి ఈ సినిమాకు సంబంధించిన సెట్స్‌ను సందర్శించాను. దాని క్వాలిటీ చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి మనం కథలు చెప్పడానికి ఇదే సరైన మార్గం. మీరు తీస్తోన్న సినిమా ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటుందని నేను నమ్ముతున్నానని అన్నారు. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, కెకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టులుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో పార్ట్ విడుదల కానుంది.





# శుభం ఓ మంచి మూవీ... ఆదరించండి

## నటి సమంత ప్రేక్షకులకు విజ్ఞప్తి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి 'శుభం' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో సామ్ అతిథి పాత్ర కూడా పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ మూవీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక మే 9న విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్ కూడా జోరుగా చేస్తున్నారు. తన హోమ్ బ్యానర్ నుంచి రాబోతున్న ఫస్ట్ మూవీ కావడంతో సమంత కూడా చాలా యాక్టివ్‌గా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొంటు-న్నారు. ఇక రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి వైజాగ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సమంతతో సహా సినిమాలో నటించిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. వైజాగ్ లో ఈవెంట్స్ జరుపుకున్న తన సినిమాలు అన్నీ గుర్తు చేసుకుంది. ఇక్కడ ఈవెంట్ చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించాయి, 'శుభం' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మూవీ చూశాక అందరు కూడా చిరు నవ్వుతోనే బయటకు వస్తారని పేర్కొన్నారు. అలాగే దాదాపు ఈ మూవీలో చాలా వరకు కొత్త వారినే తీసుకున్నారు. దీంతో ప్రతి ఒక్క ఈ మూవీ గురించి వారి అనుభూతిని పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. ' రాజ్ అండ్ డీకే కారణంగానే ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. స్టోరీ చెప్పినప్పుడే పడి పడి నవ్వుకున్నాను, హారర్ కామెడీని ఇలా కూడా తియ్యొచ్చా అనుకున్నాను. అండ్ సమంత మామ్ ఐ లవ్ యూ.. మీరు బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పగా.. సామ్ నవ్వేసింది. ప్రజంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.






# నానితో నటించడానికి నో చెప్పిన రష్మిక

హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట . నువ్వు ఇండస్ట్రీలోకి సెట్ కావు.. నీ ఫేస్ కి అంత సీన్ లేదు ..ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీలో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయన తో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట.ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది. ఇప్పుడు కనుక చూసుకుంటే నాని రష్మికకు మించిన స్థాయిలోనే క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. రీసెంట్‌గా 'హిట్ 3' మూవీతో నాని పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోతుంది. ఇది అందరికి సాధ్యం కాదు. కానీ నాని తన ట్యాలెంట్ తో సాదించుకున్నాడు. ఇప్పుడు నాని తో మూవీ అంటే ఏ హీరోయిన్ రిజక్ట్ చేసే ఛాన్స్ కూడా లేదు.



## పెరుగుతున్న ఎండలతో జనం బెంబేలు

**హైదరాబాద్,మే5( వెలుతురు):**
తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది. అప్పుడప్పుడు వానలు పడినా ఎండలు మాత్రం తగ్గేదేలే అన్నట్లు దంచికొడుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా విజృంభిచనున్నట్లు- వాతావరణ శాఖ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. మే 15 తర్వాత ఎండల తీవ్రత మరింత పెరగనుందని తెలిపింది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలకు తోడుగా 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. 12 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని తెలిపింది. ఇక, ఈశాన్య తెలంగాణలో మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## సోషల్ మీడియా వేదికగా తమపై దుష్ప్రచారం

- సీమరాజా, కిర్రాక్ ఆర్పీలపై పోలీసులకు ఫిర్యాదు
- తక్షణమే చర్యలు తీసుకోవాలని అంబటి వినతి



**గుంటూరు,మే5( వెలుతురు):**
సోషల్ మీడియాలో తమపై అసత్య, అనుచిత పోస్టులు పెడుతున్న సీమరాజా, కిర్రాక్ ఆర్పీలపై గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫిర్యాదు చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టుకైనా వెళతామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు, ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమరాజా, కిర్రాక్ ఆర్పీ వంటి సోషల్ మీడియా ఖాతాలు వైఎస్సార్‌సీపీ నాయకులపై, ప్రత్యేకించి అంబటి రాంబాబు, మాజీ మంత్రి రోజా, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలపై అనుచిత, అవమానకరమైన పోస్టులు, వీడియోలను ప్రచురిస్తున్నాయని అంబటి ఆరోపించారు. ఈ పోస్టులు వ్యక్తిగత దూషణలతో పాటు-, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కండువా వేసుకుని ప్రేలాపనలు చేసే సీమరాజా, అలాగే కిర్రాక్ ఆర్పీ వంటి వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబటి హెచ్చరించారు. గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసిన అంబటి రాంబాబు, పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. 'మా ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే, మేం న్యాయం కోసం సుప్రీంకోర్టు-కై-నా వెళతాం. ఎవరూ చట్టం కంటే గొప్పవారు కాదు,' అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, గతంలో టీ-డీపీ నాయకులు, ముఖ్యంగా నారా లోకేశ్, వైఎస్ జగన్‌పై అనుచిత టీ-÷-వట్లు- చేసినప్పుడు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంబటి ప్రశ్నించారు. అంబటి మీడియాతో మాట్లాడుతూ, సీమరాజా, కిర్రాక్ ఆర్పీలాంటి వ్యక్తులు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని, అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వారిని చట్టం ఖచ్చితంగా శిక్షిస్తుంది. వీరి భవిష్యత్తు ఏమిటో నాకు తెలుసని కిర్రాక్ ఆర్పీకి సూచనప్రాయంగా హెచ్చరికలు జారీ చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ ఫిర్యాదు ఆధారంగా సీమరాజా, కిర్రాక్ ఆర్పీలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇంకా స్పష్టత రాలేదు.

## మహిళా ఉద్యోగులకు శుభవార్త

### - ప్రసూతి సెలవులు 180కి పెంపు

**అమరావతి,మే5( వెలుతురు):**
మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివాహిత మహిళలకు ఇచ్చే మెటర్నిటీ లివ్ లను చంద్రబాబు సర్కార్ పొడగించింది. మెటర్నిటీ- లివ్‌లను 120 నుంచి 180కి పెంచింది. అంతేకాదు ఇద్దరు పిల్లకు మాత్రమే లివ్‌లు వర్తింపు అనే నిబంధనను కూడా ప్రభుత్వం తొలగించింది. మెటర్నిటీ- లివ్‌లను 180 రోజులకు పెంచుతూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుకోగా.. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మహిళా ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళా ఉద్యోగుల సమస్యలపై ఫోకస్ పెడతామని ఎన్నికల సమయంలో నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకోగా.. తాజాగా మెటర్నిటీ- లివ్‌లను పొడగించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ- లివ్‌లు 120 రోజులు ఇస్తున్నారు. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న తరహాలోనే 180 రోజులు ఇవ్వనున్నారు. అంతేకాదు ఇక నుంచి ఎంతమంది పిల్లల్ని కన్నా.. మెటర్నిటీ- లివ్‌లు మాత్రం యథావిథిగా వర్తింస్తాయి. మహిళా ఉద్యోగుల వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## విడదల గోపికి ఏసిబి కోర్టులో చుక్కెదరు

### - బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన కోర్టు

**విజయవాడ,మే5( వెలుతురు):**
బలవంతపు వసూళ్లకు పాల్పడిన కేసులో అరెస్టయిన మాజీ మంత్రి విడదల రజనీ మరిది విడదల గోపి బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. పల్నాడు జిల్లాలో స్టోన్ క్రషర్ యాజమాన్యం నుంచి బలవంతంగా నగదు వసూల్లకు పాల్పడిన కేసులో విడదల గోపిని ఏసీబీ అధికారులు ఇటీవల అరెస్ట్ చేశారు. దీంతో విజయవాడ సబ్ జైలులో విడదల గోపి ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఆమె వసూళ్లకు పాల్పడినట్లు- తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కానీ నాటి వైసీపీ ప్రభుత్వం ఆమెపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అయితే 2024లో అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలకు ప్రజలు పట్టం కట్టారు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం గత ప్రభుత్వ హాయాంలో చోటు- చేసుకున్న అవినీతి అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారించింది. అదీకాక..వైసీపీ ప్రభుత్వం కారణంగా బాధితులుగా మారిన వారంతా ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో స్టోన్ క్రషర్ యాజమాన్యం సైతం బయటకు వచ్చి.. మాజీ మంత్రి విడదల రజనీతోపాటు- ఆమె మరిది గోపి, ఆమె పీఏ రామకృష్ణ తదితరులపై ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. అందులోభాగంగా విడదల రజనీ మరిదిని ఏసీబీ అరెస్ట్ చేసింది.

# రాయలసీమ గడ్డ...నా అడ్డా

- మా జోలికి వస్తూ ఊరుకునేది లేదు
- పుల అభివృద్ధి పనులు చేపట్టిన బాలకృష్ణ



**శ్రీ సత్యసాయి జిల్లా,మే5( వెలుతురు):**
రాయలసీమ గడ్డ తన అడ్డా అని వైసీపీ నేతలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ వైసీపీ నేతలను బాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూపురం మండలం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు హిందూపురం అంటే రెండో పుట్టినిల్లుగా భావించేవారని నందమూరి బాలకృష్ణ అన్నారు. టీడీపీ అంటే ఒక జవాబుదారి పార్టీగా పేరుగాంచిందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు ఒక విజనరీ ఉన్న లీడర్ అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే హిందూపురంలో రూ. 50 కోట్ల నిధులతో పనులు చేయించానని గుర్తుచేశారు. హిందూపురంలో శాశ్వత తాగునీటి పథకానికి రూ. 136 కోట్ల నివేదికలు సిద్ధం చేశామని అన్నారు. మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. 1984లోనే ఎన్టీఆర్ తూముకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు- చేయడం.. హిందూపురం ప్రజలు మర్చి పోలేనిదని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రకమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్న బాలకృష్ణ.. టేకులోడులోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.. ఇందిరమ్మ కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్వాధీన పత్రాలను మంత్రి అనగానితో కలిసి పంపిణీ చేశారు.. మొత్తం 237 మంది లబ్దిదారులకు స్వాధీన పత్రాలు అందజేశారు.. ఇక, ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. టీ-డీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమ గడ్డ.. నా అడ్డా.. అని పేర్కొన్నారు..

## యాక్సిస్ ఎనర్జితో ప్రజలపై భారం

- తిరస్కరించిన ఒప్పందాన్ని ఎలా పునరుద్ధరిస్తారు
- సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి విమర్శలు

**విజయవాడ,మే5( వెలుతురు):**
యాక్సిస్ ఎనర్జి వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో కూటమి సర్కారు ఇప్పుడు యూనిట్ ఏకంగా రూ.4.60 చొప్పున కొనుగోలుకు సిద్ధం కావడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం రూ. 2.49 పైసలకే యూనిట్ ను కొనుగోలు చేస్తేనే విషం కక్కిన కూటమి పెద్దలు.. ఇప్పుడు ఏకండా రూ. 4.60 పైసలకు ఎలా ఒప్పందం చేసుకుంటారని ప్రశ్న వినిపిస్తోంది. ఈ ఒప్పందాన్ని ఏపీ ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. దీనిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. '2018లో తిరస్కరించిన ఒప్పందాన్ని తిరిగి తీసుకుని రావడం దారుణం. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్లు- భారం మోపి, యాక్సిస్ కంపెనీకి కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం చేయించిన ఈ ఒప్పందం ఎంత మాత్రమూ అనుమతించం. రాష్ట్ర ప్రజలపై పాతికేళ్ళపాటు రూ.15 వేల కోట్లు భారం వేసే ఈ ఒప్పందాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్‌సి) ఆమోదముద్ర వేయడం అన్యాయం. దేశంలోని అనేక రాష్ట్రాల్లో యూనిట్ రూ.2 లు, 2.50లకి ఒప్పందాలు జరుగుతున్నాయి. గతంలో అదానీ సంస్థతో సెకీ ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.49లు ఒప్పందం చేసుకోగా అది అధిక రేటు- అని తెలుగుదేశంతో సహా అన్నిపక్షాలు విమర్శించాయి. నేడు దానికంటే రూ.2.10లు అధికంగా చేసే ఒప్పందాలు చేసుకోవడం దారుణం. దీన్ని వెంటనే రద్దు చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యాక్సిస్' తో విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ మండిపడింది. సంపద సృష్టిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పుడు దోచుకోవడమే పనిగా పెట్టు- కున్నారని వైఎస్సార్‌సీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. 'కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం. మేం సెకీతో ఒప్పందం చేసుకుంటే గగ్గోలు పెట్టారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ. 2.49పైసలకు ఒప్పందం చేసుకుంది. దీనిపై విషం కక్కారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 4.60 పైసలకు ఒప్పందం చేసుకుంది. ఇవి ఎల్లో మీడియాకు కనబడటం లేదా అని ప్రశ్నించారు.

## ముస్లిం దేశాల మద్దతు కోసం పాకిస్తాన్ యత్నం

**లాహోర్, మే 5, ( వెలుతురు)**
జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, దీని వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతుండగా, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు అంతర్జాతీయ సహకారం కోరుతూ దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తున్నారు.పహల్గాంలోని బైసరన్ మైదానంలో జరిగిన ఈ దాడి, భారత్‌లోని పర్యాటకులపై లక్ష్యంగా సాగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడిని లష్కర్-ఎ-తొయిబా తో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థ తామే చేసినట్లు మొదట ప్రకటించినప్పటికీ, తర్వాత ఆ ప్రకటనను ఉపసంహరించుకుంది. ఈ దాడి వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల సమన్వయం ఉన్నట్లు భారత గూఢచార సంస్థలు ఆరోపించాయి. ఈ ఘటన భారత్‌లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దీనికి గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది.

భారత్ ప్రతీకార చర్యలు

దౌత్య చర్యలు: భారత్ పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది, వాఘా సరిహద్దును మూసివేసింది, మరియు పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసింది.

సింధు నదీ ఒప్పందం రద్దు: 1960లో రూపొందిన సింధు నదీ ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది, దీనిని పాకిస్తాన్ 'యుద్ధ చర్య'గా అభివర్ణించింది.

సైనిక సన్నద్ధత: భారత సైన్యం సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ, లైన్ ఆఫ్ కంట్రోల్ (LoC) వెంబడి పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు గట్టిగా స్పందిస్తోంది.

పాకిస్తాన్ భయాందోళన..

పహల్గాం దాడి తర్వాత భారత్ యొక్క కఠిన వైఖరి మరియు అంతర్జాతీయ మద్దతు పాకిస్తాన్‌ను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు వివిధ దేశాలతో దౌత్య సంప్రదింపులు జరుపుతున్నారు.ఐక్యరాజ్యసమితి: షరీఫ్ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌తో సంప్రదించి, భారత్%-%పాకిస్తాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం చేయాలని కోరారు.గల్ఫ్ దేశాలు: సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మరియు కువైట్ రాయబారులతో సమావేశాలు నిర్వహించి, భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. షరీఫ్ సౌదీ అరేబియా రాయబారితో జరిగిన సమావేశంలో దక్షిణాసియాలో శాంతి కోసం పాకిస్తాన్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

చైనా మరియు రష్యా: పాకిస్తాన్ ఈ రెండు దేశాలను సంప్రదించి, భారత్ యొక్క సంభావ్య దాడిని నిరోధించేందుకు సహకారం కోరింది. పాకిస్తాన్ ఈ దాడిపై నిష్పక్షపాత విచారణ కోసం కూడా పిలుపునిచ్చింది.భారత్ నుంచి సంభావ్య దాడిని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ సైన్యం రక్షణాత్మక చర్యలను చేపట్టింది. లష్కర్-ఎ-తొయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అదనపు భద్రత కల్పించడం, ఔచిఇ వెంబడి సైనిక సన్నద్ధతను పెంచడం, మరియు సరిహద్దు ప్రాంతాల్‌ఆహార సరఫరా నిల్వలను పెంచడం వంటి చర్యలు తీసుకుంది.పహల్గాం దాడిని అనేక దేశాలు ఖండించాయి, మరియు భారత్ యొక్క ప్రతీకార చర్యలకు మద్దతు ప్రకటించాయి. ఈ ఘటన అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఒంటరిగా నిలబెట్టింది.

భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలు

అమెరికా: యుఎస్ స్టేట్ సెక్రటరీ మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సంప్రదించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. అమెరికా భారత్ యొక్క 'స్వీయ రక్షణ హక్కు'ను గుర్తించింది.యూరోపియన్ దేశాలు: యూకె, డెన్మార్క్, మరియు స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ దాడిని ఖండించాయి మరియు భారత్‌తో సహకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి.ఆసియా దేశాలు: దక్షిణ కొరియా జపాన్ భారత్ యొక్క 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శూన్య సహనం' విధానాన్ని సమర్థించాయి.

పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే దేశాలు

చైనా: భారత్-పాకిస్తాన్ సంబంధాల్లో చైనా సంప్రదాయకంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తోంది. పహల్గాం దాడి సందర్భంగా కూడా చైనా పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు అందించే అవకాశం ఉంది.టర్కీ మరియు అజర్బైజాన్: ఈ రెండు దేశాలు కాశ్మీర్ విషయంలో గతంలో పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించాయి మరియు ఈ సందర్భంలో కూడా అండగా నిలిచే సూచనలు ఉన్నాయి.బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో ఇటీవలి రాజకీయ సంక్షోభం తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా వైఖరి అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వవచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం..

బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన రాజకీయ అస్థిరత తర్వాత, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను పెంచుకుంటోంది. బంగ్లాదేశ్ యొక్క ఈ కొత్త వైఖరి భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్‌కు రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చు. అయితే, బంగ్లాదేశ్ యొక్క ఆర్థిక మరియు రాజకీయ అస్థిరత దీనిని పరిమితం చేయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పహల్గాం దాడి భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ సంభావ్యతను పెంచినప్పటికీ, రెండు దేశాలూ అణ్వాయుధ శక్తులు కావడం వల్ల జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారత్ యొక్క గత ప్రతీకార చర్యలు (2016లో ఉరి, 2019లో పుల్వామా) సర్జికల్ స్ట్రైక్‌లు మరియు ఎయిర్‌స్ట్రైక్‌ల రూపంలో ఉన్నాయి. పహల్గాం దాడి కూడా ఇలాంటి ప్రతీకార చర్యలకు దారితీయవచ్చు.పాకిస్తాన్ సైన్యం ఈ దాడిని దేశీయ రాజకీయ సంక్షోభం నుండి దష్టి మళ్లించేందుకు ఉపయోగించుకున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి.అమెరికా, ఐక్యరాజ్యసమితి, మరియు గల్ఫ్ దేశాలు రెండు దేశాలను శాంతియుత సంప్రదింపులకు ప్రోత్సహిస్తున్నాయి.చైనా మరియు రష్యా వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, అవి కూడా ఓపెన్ యుద్ధాన్ని నివారించేందుకు ఒత్తిడి చేయవచ్చు.

## సింహాచలం ఘటనపై కమిటీ నివేదిక సమర్పణ



**అమరావతి,మే5( వెలుతురు):**
సింహాచలం ఆలయంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలి గత నెల 30న ఏడుగురు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి ముగ్గురు అధికారులతో ప్రభుత్వం విచారణ కమిటీ ఏర్పాటు- చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం విచారణ తర్వాత కమిటీ- ప్రభుత్వానికి సోమవారం నివేదిక అంధించింది. కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామ నారాయణ రెడ్డిలతో సీఎం చంద్రబాబు చర్చించారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని మంత్రులను సీఎం ఆదేశించారు. తాత్కాలికంగా కట్టిన గోడకు పునాది లేదని.. భారీ వర్షం వల్ల పెద్ద ఎత్తున నీరు, బురద చేరి గోడ కూలిందని కమిషన్ తమ నివేదకలో పేర్కొంది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు లీప్ హోల్స్ కూడా లేవని, చందనోత్సవానికి వారం ముందు హడావిడిగా గోడ నిర్మించారని తెలిపింది. ప్రసాద్ పథకంలో భాగంగా గోడకు అనుమతి ఇచ్చారని.. డిజైన్, పునాది లేకుండానే గోడను కట్టేశారని.. గోడ సామర్థం, భక్తుల భద్రత గురించి తనిఖీలు చేయలేదని చెప్పింది. విశాఖ సీపీ, సాక్షుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేశామని.. దుర్ఘటనకు ఆలయ ఈవో, ఇంజినీరింగ్ సిబ్బంది, పర్యాటకశాఖ అధికారులు, గుత్తేదారులే బాధ్యులు అని కమిషన్ తెలిపింది.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించండి

- రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి
- వైకాపా శ్రేణులకు జగన్ సూచన



**అమరావతి,మే5( వెలుతురు):**
రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.. చేతికి వచ్చిన ఎన్నో పంటలు దెబ్బతినడంతో.. రైతులు గగ్గోలు పెడుతున్నారు.. ఈ క్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నేతలతో భారీ వర్షాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేశారు.. అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతో పాటు అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించాలని స్పష్టం చేశారు..ఇక, రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైసీపీ నేతలకు సూచించారు. కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కల్లాల్లో పొలాల్లో రైతుల వద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని విమర్శించారు.. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది . ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్‌లో కూడా కష్టాలు పడుతున్నారని తెలిపారు.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com